తొలిరోజు ప్రశాంతం

- ఇంటర్ పరీక్షలు ప్రారంభం
- 761 మంది గైర్హాజరు



ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో...

అనంతపురం విద్య, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు తొలి రోజు శనివారం ప్రశాంతంగా సాగాయి. తొలిరోజు కావడంతో ఉదయం 7 గంటల నుంచే కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హడావుడిగా కనిపించారు. కొన్ని చోట్ల ఆలస్యంగా వచ్చిన వారు పరుగులు తీస్తూ కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో 63 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా జనరల్ విద్యార్థులు 24,068 మందికిగాను 23,443 మంది హాజరుకాగా 625 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2,360 మందికి గాను 2,224 మంది హాజరుకాగా 136 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల పర్యవేక్షణ కన్వీనర్, ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ 5 కేంద్రాలను, కమిటీ సభ్యులు 4 కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు 10 కేంద్రాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులు 14 కేంద్రాలను తనిఖీచేశారు.



న్యూటౌన్ బాయ్స్ జూనియర్ కళాశాలలో పరీక్షలు రాయడానికి సిద్ధంగా ఉన్న విద్యార్థినులు

ఒక సెంటర్ అనుకుని మరో సెంటర్‌కు...

తొలిరోజు కావడంతో విద్యార్థులు ఒక సెంటర్ అనుకుని పొరపాటున మరో సెంటర్‌కు వెళ్లారు. పలువురు విద్యార్థులకు ఆటోలో శ్రీనగర్ కాలనీలోని నీరు-ప్రగతి పార్కు సమీపంలోని అయ్యప్ప గుడి వద్ద సెంటర్ ఉందని చెప్పడంతో.. అక్కడికి వచ్చారు. తీరా అక్కడ కాగ్నిజెంట్ కాలేజ్ సెంటర్ ఉంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందారు. సెంటర్ వద్ద స్థానికులు విద్యార్థుల హాల్‌టికెట్లు చూస్తే, మాస్టర్ జూనియర్ కాలేజ్ సెంటర్ అని ఉంది. దీంతో భైరవనగర్, ఆర్టీఓ కార్యాలయం సమీపంలో ఆ సెంటర్ ఉందని చెప్పడంతో హడావుడిగా అక్కడికి వెనుతిరిగి వెళ్లారు.



మాస్టర్ కాలేజీకు వెళ్లాలనుకుని కాగ్నిజెంట్ కాలేజ్ వద్దకు ఆటోలో వచ్చిన విద్యార్థులు





అనంతపురంలో జరిగిన ఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న హోం మంత్రి అనిత

100 రోజుల్లో శిక్ష పడాలి

నేరగాళ్లలో భయం పుట్టాలి

బాధితులకు భరోసాగా నిలవండి

కొత్త ఎస్ఐలకు హోం మంత్రి అనిత సూచన

పీటీసీలో ఘనంగా పాసింగ్ అవుట్ పరేడ్

అనంతపురం సెంట్రల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నేరం చేసినవారికి వంద రోజుల్లో శిక్ష పడేలా పోలీసు యంత్రాంగం పనిచేయాలని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఎవరికి ఏ చిన్న సమస్య ఎదురైనా వెంటనే గుర్తొచ్చేది పోలీసులేనని అనంతపురం పీటీసీలో శిక్షణ పూర్తి చేసుకున్న 394 మంది ఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్‌లో శనివారం ఆమె పాల్గొన్నారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాతో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆమె ప్రసంగించారు. 'పోలీసు ఉద్యోగం చేపట్టాక ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పటివరకు మీ పరిధి చాలా చిన్నది. రేపటి నుంచి చాలా విస్తృతమౌతుంది..' అని విధుల్లో చేరబోతున్న ఎస్ఐలనుద్దేశించి అన్నారు. పోలీసులు చెప్పే ఒక్క మాటతో బాధితుల కష్టాలు సగం తీరుతాయని అన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న తపనతో ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. తనను హోం మంత్రిని చేసిన సీఎం (మిగతా 6వ పేజీలో..)

నెలవంక దర్శనం

రంజాన్ మాసం ఆరంభం..

నేటి నుంచి ఉపవాస దీక్షలు



ఇఫ్తార్	సెహరీ
6.29	5.19
ఆదివారం సాయంత్రం	సోమవారం ఉదయం



అనంతపురం కల్చరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం ఆరంభమైంది. జిల్లాలో శనివారం రాత్రి నెలవంక దర్శనమివ్వడంతో వేడుకలకు సిద్ధమయ్యారు. ఉపవాస దీక్షలను ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నారు. మానవ జీవితానికి సార్థకత చేకూర్చుకునేందుకు అల్లా ప్రసాదించిన అద్భుత అవకాశం రంజాన్ మాసమని ముస్లింలు విశ్వసిస్తారు. కోర్కెలను నియంత్రించుకుని, భగవంతునిపై మనస్సును లగ్నం చేసే మహత్తర ప్రక్రియ ఈ మాసంలోనే సాగుతుంది. కఠిన నిబంధనలు, క్రమశిక్షణ, దాతృత్వం, ఆధ్యాత్మిక చింతనల కలయిక రంజాన్ మాసం. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం తొమ్మిదో నెలలో వచ్చే పవిత్ర రంజాన్ ముస్లింలకు అతిపెద్ద పండుగ. ఏడాదిలో 11 నెలలు ఎలా గడిపినా, రంజాన్ మాసంలో మాత్రం దైవచింతనతో గడపాలని మతగురువులు సూచిస్తున్నారు. పనుల్లో నిమగ్నమవుతూనే దైవ చింతనతో గడపాలని, ప్రాపంచిక విషయాలపై దృష్టి సారించకూడదన్నది రంజాన్ నిబంధనల్లో ఒకటి. నిష్కల్మషంగా ఉండాలని, కలలోకూడా ఇతరులకు అపకారం తలపెట్టాలనే ఆలోచన చేయకుండా మెలగాలి సూచిస్తున్నారు. ఉదయం, సాయంత్రం ఇఫ్తార్, సెహరీలు, ప్రత్యేక దువా ప్రార్థనలతో మసీదులలో ఆధ్యాత్మిక సందడి ప్రారంభం కానుంది.

పింఛన్ల పంపిణీలో 'అనంత'కు

తృతీయ స్థానం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో అనంతపురం జిల్లా తృతీయ స్థానంలో నిలిచింది. ఉదయం 7గంటల నుంచే గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులు ఇళ్లవద్దకే వెళ్లి పంపిణీ ప్రారంభించారు. 2,79,695 మందికి రూ.123.87 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఒకేరోజు 2,69,119 మందికి రూ.118.97కోట్లు పంపిణీ చేసి 96.22 శాతంతో తృతీయ స్థానంలో జిల్లాను నిలిపారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీలో ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ కంట్రోల్ రూం నుంచి డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య నేతృత్వంలోని అధికారులు మానిటరింగ్ చేశారు. ఎక్కడా అంతరాయం లేకుండా సాయంత్రం వరకు పింఛన్లు పంపిణీ చేశారు. కలెక్టర్ వినోద్‌కుమార్ తాడిపత్రి నియోజకవర్గంలో పాల్గొన్నారు. మిగిలిన లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేస్తారు.

నగరపాలన గందరగోళం

- ఒకే అధికారికి మూడు సీట్లు
- డిప్యూటీ కమిషనర్.. హిందూపురం ఇన్‌చార్జి
- మడకశిర కమిషనర్.. కార్పొరేషన్ సెక్రటరీ
- డిప్యుటేషన్‌పై వచ్చిన డీఈఈ... ఇన్‌చార్జ్ ఈఈ
- అడ్డగోలు ఉత్తర్వులతో అయోమయం

అనంతపురం క్రైం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నగర పాలన గందరగోళంలో పడింది. బదిలీలు, డిప్యుటేషన్లు, అదనపు బాధ్యతల్లో అడ్డగోలుగా ఉత్తర్వులు ఇచ్చారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కింది స్థాయి సిబ్బంది నుంచి అధికారుల వరకు ఎవరు ఏ పని చేస్తున్నారో అర్థం కాని అయోమయం నెలకొంది. నెలన్నర వ్యవధిలో ముగ్గురు కమిషనర్లు మారడం, అడిషనల్ కమిషనర్ పోస్టు ఖాళీగా ఉండడం ఇందుకు నిదర్శంగా నిలిచింది. దాదాపు ఐదు నెలలుగా సెక్రటరీ పోస్టు ఖాళీగా ఉంది. కీలకమైన టౌన్‌ప్లానింగ్ విభాగం అవినీతికి అడ్డాగా మారింది. వారు కార్పొరేషన్ ఆదాయానికి గండికొడు తూ జేబులు నింపుకోవడంలో బిజీ అయ్యారు. కొత్త కమిషనర్‌కు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనడానికి, పారిశుధ్యం పనులు పర్యవేక్షించడానికి, ఇతర ఫైల్స్ పరిశీలించడానికే సమయం సరిపోతోంది. ఆయన ఇప్పటి వరకు ఒక్క అక్రమ కట్టడమైనా పరిశీలించినట్లు కనిపించడం లేదు. ఇంజనీరింగ్‌లో ఒకే రోజు ఎస్ఈ, ఈఈ పదవీ విరమణ చెందారు. టెండరు పిలిచి ముందుకు సాగని పనులు ఎన్నో ఉన్నాయి. వాటిని చక్కదిద్దడానికి ఎంత సమయం పడుతుందో తెలియదు.

ఆడా ఉంటా.. ఈడా ఉంటా



నగరపాలికలో అత్యంత కీలకమైన రెవెన్యూ విభాగాన్ని ప్రస్తుతం డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షిస్తున్నారు. గతంలో అడిషనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు ఇద్దరూ పర్యవేక్షించేవారు. ఇప్పుడు ఒక్కరే చూస్తున్నారు. నగరంలోని 50 డివిజన్ల పరిధిలో పన్నుల వసూళ్లు సవాలుగా మారింది. టైటిల్ ట్రాన్స్‌ఫర్, కొత్త వాటికి పన్నులు విధించడం తదితర పనులు నిత్యం జరుగుతుంటాయి. అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ సెలవులో వెళ్లినప్పటి నుంచి ఈయనే ఆ పోస్టుకు ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఆయనను శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు. అంటే ఒకే అధికారికి మూడు సీట్లన్నమాట. హిందూపురం కమిషనర్‌గా ఉన్న సంగం శ్రీనివాసులు (గతంలో ఇక్కడ సెక్రటరీగా పనిచేశారు), డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు క్లోజ్ అని, ఈయన బదిలీపైనే హిందూపురం వెళ్లారని ప్రచారం జరిగింది. మరి ఈయనే కొరుకున్నారో లేక ఉన్నతాధికారుల ఆలోచనో తెలియదు కానీ అక్కడ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకోవాలంటూ ఆదేశాలు అందాయి. అదేమీ సమీపంలో ఉన్న మున్సిపాలిటీ కాదు. వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్టణం. అంటే ఈయన అక్కడ మూడు రోజులు, ఇక్కడ మూడు రోజులు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

ఇక్కడ ఏం చేస్తారో...?

కర్ణాటక సరిహద్దులో ఉన్న మడకశిర నగర పంచాయతీ కమిషనర్ రంగస్వామిని అనంతపురం నగరపాలికలో ఇన్‌చార్జి సెక్రటరీగా బాధ్యతలు చేపట్టాలంటూ ఆదేశాలిచ్చారు. ఆదేశాలొచ్చి వారం రోజులైంది. రెండు రోజుల క్రితం వచ్చి కమిషనర్‌ను కలిసినట్లు సమాచారం. ఎంత చిన్న నగరపంచాయతీ అయినా కమిషనర్ పోస్టులో కీలకంగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అలాంటి అధికారికి ఎంతో దూరంలో ఉన్న అనంతపురం కార్పొరేషన్‌లో ఇన్‌చార్జి సెక్రటరీగా పనిచేయాల్సి రావడం అంత ఈజీ కాదు. ఉన్నతాధికారులు ఎలా ఉత్తర్వులిచ్చారో మరి.

డిప్యుటేషన్ డీఈకి ఇన్‌చార్జ్

డీఈగా నరసింహులు నగరపాలికలో దీర్ఘకాలం పనిచేశారు. అనంతరం కడపకు బదిలీపై వెళ్లారు. మళ్లీ త్వరగానే అనంతపురం కార్పొరేషన్‌కు డిప్యుటేషన్ మీద వచ్చారు. తాజాగా ఇక్కడ పనిచేస్తున్న ఈఈ రాధాకృష్ణ పదవీ విరమణ చెందారు. దీంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ ఈఈ బాధ్యతలు అప్పగించారు. ఇది కూడా విమర్శలకు తావిస్తోంది. డిప్యుటేషన్‌పై వచ్చిన డీఈకి ఇన్‌చార్జ్ ఈఈ బాధ్యతలు ఎలా అప్పగిస్తారనే ప్రశ్న ఎదురవుతోంది. ఇలా అన్నింటా పై అధికారులు తీసుకున్న నిర్ణయాలు నగరపాలికను గందరగోళంలో పడేశాయి. వీటన్నింటినీ తట్టుకుని కమిషనర్ ఎలా ముందుకెళ్తారో చూడాల్సిందే.

పల్లెలకు నీటి కష్టం

స్పందించని అధికారులు



రాయలచెరువులో ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న స్థానికులు

యాడికి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వేసవి రాకనే గ్రామాల్లో దాహపుకేకలు మొదలయ్యాయి. అధికారులు ఎటువంటి ముందస్తు చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్షుంపల్లిలో బోరుబావిలో నీరు అడుగంటింది. అరకొరగా వస్తున్న నీరు ఏమాత్రం సరిపోవడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోయినా స్పందించడం లేదని గ్రామస్థులు అంటున్నారు. కేశవరాయునిపేటలో నీటి కొరతతో ఇబ్బందులు తప్పడం లేదు. ట్యాంకర్ల ద్వారా అయినా నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు. రాయలచెరువులో బోరుబావుల మోటార్లు చెడిపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దాతలు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడంతో కొంత ఊరట కలుగుతోంది. యాడికి హౌసింగ్ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పరిష్కరించాలని కోరుతూ స్థానికులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. అయినా స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిన్నేపల్లిలో తాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. కత్తిమానుపల్లిలో తాగునీటి కొరత ఏర్పడింది. గ్రామస్థులు పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చి అధికారులను నిలదీశారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి కొరత ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఓపెన్‌గా కబ్జా

- ఆక్రమణలకు కేంద్రంగా చిన్నంపల్లి
- ప్రభుత్వ స్థలాల కబ్జాలో వైసీపీ, టీడీపీ మధ్య పోటీ

మటన్ మార్కెట్‌లో 20సెంట్లకు పైగా ఓపెన్ సైట్ కబ్జా

పట్టించుకోని రెవెన్యూ, పంచాయతీ అధికారులు



ఓపెన్ సైట్‌ను ఆక్రమించి బండలు పాతిన దృశ్యం


అనంతపురంరూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని చిన్నంపల్లి కబ్జాలకు కేంద్రంగా మారింది. గ్రామంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలో వైసీపీ, టీడీపీ నాయకులు పోటీ పడుతున్నారు. గత కొన్నిరోజులుగా గ్రామంలో జరుగుతున్న ఆక్రమణలే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తున్నాయి. వైసీపీ నాయకులు వంక స్థలాలు ఆక్రమిస్తుంటే, తామేమి తక్కువే కాదన్నట్లు టీడీపీ నాయకులు కూడా వారినే అనుసరిస్తున్నారు. ఈక్రమంలోనే గ్రామ పరిధిలోని మటన్ మార్కెట్‌లో ప్రజా అవసరాల కోసం వదిలిన(ఓపెన్‌సైట్) స్థలాన్ని ఆక్రమించేశారు. ప్రభుత్వ భూములు, స్థలాలు కబ్జా కాకుండా చూడాల్సిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఈ విషయాన్ని చూసీచూడనట్లు వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత కబ్జాదారులతో కొందరు ఉద్యోగులు కుమ్మక్కు కావడం వల్లే పట్టించుకోవడం లేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

20సెంట్లకుపైగా ఆక్రమణ

చిన్నంపల్లి గ్రామ పంచాయతీ కురుగుంట గ్రామ సర్వే నెంబరు 83-4, 11, 12లోని మటన్ మార్కెట్‌లో ఇరవై ఎళ్ల కిందట పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. ఈ లేఅవుట్‌లో చాల వరకు ఖాళీ స్థలాలు ఉన్నాయి. దీంతో ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకులు అక్కడ వాలిపోతుంటారు. వైసీపీ హయాంలోనూ ఓ నాయకుడు ఇష్టారాజ్యంగా ఖాళీ స్థలాలను అమ్ముకు తిన్నాడు. ఆ సొమ్ముతోనే స్థానికంగా ఉన్న పది సెంట్లలో ఇల్లు కూడా కట్టుకున్నాడు. పేదలకు ఒకటిన్నర సెంటు స్థలం ఇచ్చేందుకు చేతులురాని రెవెన్యూ అధికారులు, పది సెంట్లు ఆక్రమించి ఇల్లు కట్టుకున్నా అక్రమార్కులపై నోరు మెదపలేకున్నారు. ఇప్పుడూ ఇదే లేఅవుట్‌లో ప్రజా అవసరాలు, ఆలయాల నిర్మాణం కోసం 20 సెంట్లకు పైగా ఓపెన్ సైట్ వదిలారు. ఆ స్థలంపై గంగవరం, పాపంపల్లికి చెందిన టీడీపీ నాయకుల కన్నుపడింది. ఈనేపథ్యంలోనే స్థలాన్ని కబ్జా చేసి, బండలు పాతారు. ఆ స్థలాన్ని ఇతరులకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఇక్కడ సెంటు రూ.2లక్షల వరకు పలుకుతోంది. అంటే దాదాపు రూ.అరకోటి విలువ చేసే ఓపెన్ సైట్ అన్యాక్రాంతం అవుతోంది. ఇంత జరుగుతున్న క్షేత్రస్థాయిలోని సంబంధిత శాఖల ఉద్యోగులు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఎక్కువ శాతం పక్క మండలం వారే..

అనంతపురం రూరల్ మండలం ఎటుచూసిన జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉంటుంది. ఈక్రమంలో ప్రైవేట్ భూములతో పాటు ప్రభుత్వ భూములకు విలువ ఎక్కువ. మరి ముఖ్యంగా ప్రభుత్వ భూముల ఆక్రమణ అంటేనే మొదట గుర్తు కొచ్చే గ్రామాలు కురుగుంట, చిన్నంపల్లి. ఈ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు కనిపించడం ఆలస్యం వెంటనే కబ్జాదారులు అక్కడ వాలిపోతున్నారు. ఇటీవల ఆత్మకూరు మండలం తోపుదుర్తికి చెందిన ఓ నాయకుడు అదే మండలం ముట్టాలకు చెందిన టీడీపీ సానుభూతిపరుడిని అడ్డం పెట్టుకుని చిన్నంపల్లి గ్రామం 98-3లోని మూడు ఎకరాల వంక పోరం బోకు స్థలాన్ని చదును చేయించాడు. దాన్ని విక్రయించే పనుల్లో నిమగ్నమయ్యాడు. ఇప్పుడు మటన్ మార్కెట్‌లో ఓపెన్ సైట్‌ను ఆక్రమించినవారు కూడా పక్క మండలానికి చెందిన వారే కావడం గమనార్హం. ఆత్మకూరు మండలం పాపంపల్లి, బెళుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు ఆక్రమించి సొమ్ము చేసుకుంటున్నారు.



ప్లాన్‌లో ఆక్రమించిన ఓపెన్ సైట్

విచారించి చర్యలు తీసుకుంటాం



ఓపెన్ సైట్ ఆక్రమణ గురించి నా దృష్టికి రాలేదు. పంచాయతీ కార్యదర్శితో విచారించి, ఆమేరకు చర్యలు తీసుకుంటాం. మాతోపాటు రెవెన్యూ అధికారులను సమన్వయం చేసుకుని స్థలం కబ్జాకాకుండా చూస్తాం.

\- వెంకటనాయుడు, ఈఓఆర్డీ, అనంతపురం రూరల్ మండలం

ఓపిక లేని డాక్టర్లకు మెమో



విభాగాలను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు

అనంతపురం టౌన్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): జిల్లాసర్వజన ఆస్పత్రిలో ఓపీ డ్యూటీలకు డుమ్మాకొట్టే డాక్టర్లకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు మెమోలు జారీ చేశారు. ఇటీవలే ముగ్గురు డాక్టర్లకు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం ఉదయం 10గంటల సమయంలో ఆయన వివిధ విభాగాల ఓపీలను తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆర్థో విభాగంలో డాక్టరు నిస్సార్‌అహ్మద్, డాక్టరు రామాంజనేయులు డ్యూటీలో కనిపించలేదు. అలాగే సర్జరీ విభాగం ఓపీలో డాక్టరు ఉజ్జనేశ్వరి, ఫిజీషియన్ విభాగం ఓపీలో డాక్టరు నరసింహారెడ్డి డ్యూటీలో లేకుండాపోయారు. నిబంధనల మేరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రతిడాక్టరు ఓపీలో ఉండాల్సి ఉంది. కానీ 10గంటలు దాటినా ఆ నలుగురు డాక్టర్లు డ్యూటీకి రాలేదని తెలియడంతో సూపరింటెండెంట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆతర్వాత ఆ నలుగురు డాక్టర్లకు మెమోలు జరీ చేశారు. మళ్లీ డ్యూటీలకు గైర్హాజరైతే డీఎంఈకి ఫిర్యాదు చేసి, అక్కడి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇక నుంచి రోజుకు మూడుసార్లు తనిఖీలు చేస్తానని, ప్రతిఒక్కరు సమయపాలన పాటించి రోగులకు వైద్యసేవలు అందించాలన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న హోంమంత్రి అనిత



తల్లికి పాదాభివందనం



పరేడ్‌ను తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



హాజరైన ఎస్‌ఐల కుటుంబ సభ్యులు



పాసింగ్ అవుట్ పరేడ్‌ను తిలకిస్తున్న పోలీస్ అధికారులు



ఆనంద క్షణాలు..



కుటుంబ సభ్యులతో...



వంద రోజుల్లో శిక్ష పడాలి

(5వ పేజీ తరువాయి)



చంద్రబాబు, ఎన్డీఏ కూటమి సభ్యులకు ధన్యవాదాలని అన్నారు. హోం మంత్రిగా ఇలాంటి పరేడ్ మైదానంలో నిలబడాలంటే అదృష్టం, అర్హత, ప్రజల దీవెనలు ఉండాలని అన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్లుగా 394 మంది సమాజంలో అడుగుపెట్టడం అరుదైన అంశమని అన్నారు. పాసింగ్ అవుట్ పెరేడ్‌లో నిలబడ్డ మిమ్మల్ని చూస్తున్న తల్లిదండ్రుల హృదయాలు ఆనందంతో ఉప్పొంగిపోతున్నాయని అన్నారు. ఎంటెక్, బీటెక్, ఫార్మసీ, ఆర్ట్స్ అండ్ సైన్స్ కోర్సులు అభ్యసించిన వారు ఎస్‌లుగా ఎన్నికయ్యారని అన్నారు. ఇంజనీరింగ్ కోర్సులు చేసినవారు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా రూ.లక్షల జీతాలు తీసుకోవచ్చని, అయినా ప్రజాసేవ చేయాలనే తపన, పోలీస్ ఉద్యోగం పట్ల ప్యాషన్‌తో ముందుకు వచ్చారని అన్నారు. పోలీసు ఉద్యోగంలోకి రావాలంటే త్యాగం చేయాలని, ఎంత కష్టపడి చదవారో అర్థమౌతోందని అన్నారు. పోలీసులు అంటే ఇలా ఉండాలి అనేలా నడుచుకోవాలని సూచించారు. పోలీసులు చేసే తప్పులు, ఒప్పులు ప్రభుత్వం మీద ప్రభావం చూపుతాయని అన్నారు.

మంచి నాయకత్వం

సాంకేతికతను ప్రోత్సహించే విజన్ ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పనిచేస్తున్నామని హోం మంత్రి అన్నారు. సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయాయని, పోలీసులను కూడా బురడీ కొట్టించే తెలివితేటలు దొంగలకు ఉన్నాయని అన్నారు. నేరస్థులకే అన్ని తెలివితేటలుంటే.. కష్టపడి చదివి, కఠినతరమైన శిక్షణపొంది, జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన పోలీసులకు ఇంకెన్ని తెలివితేటలుండాలో ఒకసారి ఆలోచన చేసుకోవాలని సూచించారు. అందుకే నిరంతర అభ్యసకులుగా ఉండాలని అన్నారు. సైబర్ నేరాల కట్టడికి ప్రతి జిల్లాలో ఒక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించారని అన్నారు. శిక్షణ పొందిన ఎస్‌ఐలలో 97 మంది మహిళలు ఉన్నారని, అందరికీ శిరస్సు వంచి సెల్యూట్ చేస్తున్నాని అన్నారు.

నేరాలను అరికట్టేందుకు..

మహిళల హత్యలు, అత్యారాలను కట్టడి చేయడానికి సీఎం చంద్రబాబు కంకణం కట్టుకున్నారని అన్నారు. ఇలాంటి నేరాలు చేసేవారికి వందరోజుల్లో శిక్ష పడేలా యంత్రాంగం పనిచేయాలని సీఎం ఆదేశించారని అన్నారు. ఫోరెన్సిక్ రిపోర్ట్, హశామ్ సర్టిఫికెట్, చార్జీషీట్, కోర్టుకు ఆధారాలు సమర్పించడం.. ఇలా మొత్తం ప్రక్రియ వంద రోజుల్లో పూర్తికావాలని అన్నారు. రాష్ట్రం ఎందుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో గంజాయి ఒకటని, గంజాయి ఒక తరాన్ని నాశనం చేసే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యం కారణంగా స్కూల్ బ్యాగుల్లోకి గంజాయి చేరిందని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో పోలీసు యంత్రాంగం గంజాయి సాగును అరికడుతోందని అన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపడానికి ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి, బడ్జెట్‌లో నిధులు కేటాయించామనిఅన్నారు. తొమ్మిది నెలల కాలంలోనే లక్ష కేజీలపైన గంజాయిని ధ్వంసం చేశామని అన్నారు. అనకాపల్లి, విశాఖపట్నం, శ్రీకాకుళం, కాకినాడ, వెస్ట్ గోదావరి ఇలా పలు జిల్లాల్లో పోలీసు యంత్రాంగం గంజాయి రవాణా జరగకుండా కట్టడి చేసిందని అన్నారు.

రాగద్వేషాలకు అతీతంగా సేవలు: డీజీపీ



రాగద్వేషాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందించాలని శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరబోతున్న ఎస్‌ఐలకు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పిలుపునిచ్చారు. పాసింగ్ అవుట్ పరేడ్‌లో చేసిన ఆ ప్రమాణానికి అనుగుణంగానే ఉద్యోగ విరమణ పొందే వరకూ పనిచేయాలని సూచించారు. మానవ హక్కులను కాపాడుతూనే... రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలకు అనుగుణంగా పనిచేయాలని అన్నారు. పోలీసు సేవలు అవసరమైన వారి పట్ల మరింత సానుభూతితో ఉండాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తోందని అన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారం కోసం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రస్సల్ సిస్టమ్‌ను అమలు చేస్తోందని అన్నారు. ఈ సిస్టమ్‌కు మంచి స్పందన లభిస్తోందని అన్నారు. 52 శాతం మంది మహిళలు పిటిషనర్లుగా వస్తున్నారంటే... పోలీసుశాఖ, ప్రభుత్వంపై విశ్వాసం పెరిగినట్లేనని స్పష్టంగా అవగతమవుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు శిక్షణా విభాగం ఐజీ కేవీ మోహన్‌రావు, ఏపీ ఎస్పీ బెటాలియన్ విభాగం ఐజీ రాజకుమారి, కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీలు జగదీష్, రత్న తదితరులు పాల్గొన్నారు.







మంత్రి నుంచి ప్రసంశాపత్రం, ట్రోఫీ, మెడల్‌ను అందుకుంటున్న పి.వీరచక్ర దొర, మల్లికార్జున, అరుణ్ వెంకట్ సాయినాథ్, జమలయ్య, మంజునాథ్

ఏటికి ఎదురీదిన ఏడుకొండలు



తల్లి సుశీల, చెల్లి శ్రావణితో ఏడుకొండలు

నెల్లూరు జిల్లా వలేటివారిపాళెం మండలం పోలినేనివారిపాళెం గ్రామానికి చెందిన నేత కూరి వెంకటేశ్వర్లు, సుశీల దంపతుల కుమారుడు ఏడుకొండలు పడ్డ కష్టాలు అన్నీ ఇన్ని కావు. ఎనిమిదో తరగతి వరకు స్వగ్రామంలో చదువుకున్నాడు. ఆ సమయంలో తండ్రి వెంకటేశ్వర్లు మరణించాడు. కుటుంబాన్ని పోషించేందుకు బెంగళూరుకు వలస వెళ్లిన ఆయన.. బేల్దారి పనులుచేస్తూ 2005లో మృతిచెందారు. తండ్రి పనిచేస్తేగాని వారికి పూట గడవదు. ఏడుకొండలు, తల్లి సుశీల, చెల్లెలు శ్రావణి దిక్కులేనివారయ్యారు. అయినా పట్టువీడకుండా చదివాడు. కందుకూరులో ఇంటర్, సింగరాయకొండలో టీటీసీ పూర్తిచేశాడు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టు సాధించాలని ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఎలాగైనా ప్రభుత్వం ఉద్యోగం సాధించాలన్న కసితో కూలిపనులకు వెళుతూనే ఓపెన్ యూనివర్శిటీలో డిగ్రీ పూర్తిచేశాడు. ఎస్‌ఐ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ వచ్చే సమయానికి చేతిలో చిల్లిగవ్వలేదు. పరిస్థితిని గమనించిన ఆదే గ్రామానికి చెందిన అనుమోలు రవీంద్ర, మాదాల లక్ష్మీనరసింహ అనే రైతులు ఆర్థిక సాయం చేశారు. కాకినాడకు వెళ్లి శిక్షణ తీసుకున్న ఏడుకొండలు.. ఎస్‌ఐ పరీక్షల్లో 398 ర్యాంకును సాధించాడు.

కవల సోదరికి సెల్యూట్



పాసింగ్ అవుట్ పరేడ్ నుంచి బయటకు వచ్చిన ఫ్రైసీ.. ఓ కానిస్టేబుల్‌కు సెల్యూట్ చేశారు. ఆ కానిస్టేబుల్ ఎవరో కాదు.. స్వయానా ఆమె సోదరి. సోమందేపల్లి మండలం నల్లగొండరాయుని పల్లెకు చెందిన పరమేశ్వర్, సుశీల దంపతులకు కవలలుగా పుట్టారు ఫ్రైసీ, గ్లోరి. డిగ్రీ వరకు కలిసి చదువుకున్నారు. మొదట గ్లోరినే ఉద్యోగాన్ని సాధించారు. సచివాలయ కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూ, తన సోదరి ఫ్రైసీకి సాయపడ్డారు. ఎస్‌ఐ పోస్టు సాధించిన ఫ్రైసీ.. సెల్యూట్ చేసి తన సోదరికి కృతజ్ఞతలు తెలిపారు. తల్లిదండ్రుల కష్టంతో ప్రభుత్వ కొలువులు సాధించామని వారు అన్నారు.

చైతన్య స్వరూపిణి



మొత్తం 394 మంది కొత్త ఎస్‌ఐలలో చైతన్య స్వరూపిణి గోల్డ్‌మెడల్ సాధించారు. కర్నూలుకు చెందిన వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి దంపతుల కూతురు చైతన్య. డిగ్రీలో బయోటెక్నాలజీ పూర్తిచేశారు. హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తన తండ్రి వెంకటేశ్వర్లుని ఆదర్శంగా తీసుకుని ఎస్‌ఐ పోస్టును సాధించారు. 12 నెలల శిక్షణా కాలంలో ప్రతిభను చూపి హోం మంత్రి నుంచి గోల్డ్‌మెడల్ అందుకున్నారు.

భర్త ప్రోత్సాహంతోనే...



బీటెక్ మెరైన్ ఇంజనీరింగ్ పూర్తిచేశాను. మాది పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంత్ర మండలం మార్టేరు. నేవల్ ఆర్మీలో పనిచేయాలని, యూనిఫాం వేసుకోవాలని చాలా ఇష్టపడ్డాను. పెళ్లి అయిన వారికి అవకాశం లేకపోవడంతో నిరాశపడ్డాను. నా భర్త సద్దాం సాదిక్ ప్రోత్సాహంతో ఎస్‌ఐ పరీక్షలు రాసి ర్యాంకు సాధించాను. తల్లి రెహనా అంజుం, నాన్న సలాహుద్దీన్, అత్త అప్సర జహాన్, మామ సాదిక్ నన్ను గ్రూప్-1 ఆఫీసర్‌గా చూడాలని కోరుకున్నారు. భవిష్యత్తులో వారి కలలను నెరవేరుస్తాను.

- సాహిబ అంజుం

ఐపీఎస్ సాధిస్తా...



ఐపీఎస్ సాధించాలని ఎస్‌ఐగా పరీక్షలు రాశాను. ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసి, ఎస్‌ఐ పరీక్షల్లో ప్రిమిల్స్‌లో పాస్ అయ్యాను. ఈవెంట్స్‌లోనూ అర్హత సాధించాను. మెయిన్స్‌లో మెరిట్ వచ్చింది. శిక్షణా కాలంలో ప్రతి ఒక్కరూ మమ్మల్ని కుటుంబ సభ్యులుగా భావించి తీర్చిదిద్దారు. ఇక్కడి నుంచి వెళ్లాలంటే బాధగా ఉంది. ఆర్‌ఐ వేణుగోపాల్, ఇన్‌స్ట్రక్టర్స్, ఇండోర్ ఫ్యాకల్టీ, కేర్ టేకర్స్.. ఇలా అందరి సహకారం మరువలేనిది. మా కుటుంబ సభ్యులు కష్టపడి చదివించారు. వారికి జీవితాంతం రుణపడి ఉంటాను.

- అరుణ్ వెంకట్ సాయినాథ్

సీమ ప్రయోజనాలను విస్మరిస్తున్న పాలకులు

రాయలసీమ అభివృద్ధి వేదిక



ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న రాయలసీమ అభివృద్ధి వేదిక నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పాలకులు రాయల సీమ ప్రజల ఆకాంక్షలు, ప్రయోజనాలను విస్మరిస్తున్నారని రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ విమర్శించారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో మరో మూడు బ్యాంకుల విలీనం చేసిన తరువాత ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ శనివారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక అంబేడ్కర్ రోడ్డులో ఉన్న ఏపీజీబీ ప్రాంతీయ కార్యాలయం ఎదుట నిర్వహించారు. రాయలసీమ అభివృద్ధి వేదిక, సీఐటీయూ, ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ ఏపీలోని నాలుగు గ్రామీణ బ్యాంకులు, తెలంగాణలోని వరంగల్ జిల్లాలో ముడిపడి ఉన్న గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి రాష్ట్రస్థాయి బ్యాంకుగా ఏర్పాటు చేయాలన్న కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఆనంతగ్రామీణ బ్యాంకు, పినాకిని గ్రామీణ బ్యాంకు, రాయలసీమ గ్రామీణ బ్యాంకులను కలిపి 2006లో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేశారన్నారు. ప్రధాన కార్యాలయాన్ని కడపలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2024 నవంబరులో కేంద్ర ఆర్థిక శాఖ, ఆర్‌బీఐ విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం గ్రామీణ బ్యాంకులన్నింటినీ విలీనం చేయాలని నిర్ణయించిన తరువాత ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే ఉంచాలని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, నాయకులు వెంకటనారాయణ, ముత్తూజా, రామాంజనేయులు, తిరుమలేష్, జిలాన్‌భాషా, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు కృష్ణమూర్తి, రైతుసంఘం నాయకులు శివారెడ్డి, బీహెచ్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల మాధవ్‌పై చర్యలు తీసుకోండి

హోం మంత్రికి తెలుగు మహిళల ఫిర్యాదు



హోం శాఖ మంత్రికి వినతి పత్రం సమర్పిస్తున్న తెలుగు మహిళలు

అనంతపురం అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి అనితకు తెలుగు మహిళలు ఫిర్యాదు చేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన హోంమంత్రిని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, తెలుగు మహిళలు కంఠాదేవి, మహేశ్వరి శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. పోక్సో కేసులో బాధితుల పేర్లు వెల్లడించినందుకు మాజీ మహిళ కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆయనపై కేసు నమోదు చేయించారన్నారు. ఆ కేసు విషయంపై విచారణకు హాజరుకావాలని విజయవాడ పోలీసులు గోరంట్ల మాధవ్‌కు నోటీసులు ఇచ్చారన్నారు. ఆయనపై వచ్చిన అభియోగం గురించి మాట్లాడకుండా అసందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను ఉద్దేశిస్తూ రాష్ట్రంలో అంతర్యుద్ధం మొదలైందని వ్యాఖ్యానించడం వెనుక ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు వైసీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని స్పష్టమవుతోందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, అలజడులు సృష్టించి, వ్యక్తులు, వర్గాల మధ్య వైషమ్యాలు సృష్టించేలా మాట్లాడిన గోరంట్ల మాధవ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

విరబూసిన పూత

డిసెంబరు ఆఖరు నుంచి రాక ఆరంభం

వాతావరణంలో మార్పులే కారణం

ఈసారి మామిడి దిగుబడిపై రైతుల్లో ఆశలు



కుందుర్పి వద్ద పూతతో కళకళలాడుతున్న మామిడి చెట్లు

అనంతపురం అర్బన్/కుందుర్పి మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మామిడి పూత ఈ సారి నిండుగా కనిపిస్తోంది. ప్రస్తుతం మామిడి తోటలన్నీ పూతతో కళకళలాడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 40వేల హెక్టార్లల్లో మామిడి పంట సాగులో ఉంది. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఆత్మకూరు, కదిరి, తలుపుల, తనకల్లు, గార్లదిన్నె, ముదిగుబ్బ, గాండ్లపెంట, ధర్మవరం తదితర ప్రాంతాల్లో ఎక్కువ శాతం మామిడి పంట సాగవుతోంది. ఆయా ప్రాంతాల్లో బేనీషా, బెంగళూరు రకం, తోతాపురి, నీలం, రాయల్ స్పెషల్, ఖాదర్, హిమయత్ తదితర రకాలను రైతులు సాగు చేస్తున్నారు. గత కొన్నేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి మామిడి పూత వచ్చినట్లు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. పంట పలు దశల్లో తగిన సస్యరక్షణ చర్యలు తీసుకుంటే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

75 శాతం తోటలు పిందె దశలో..

గతేడాది డిసెంబరు నెలాఖరులో ఎండలు ప్రారంభమైనప్పటి నుంచి మామిడిలో పూత మొదలైంది. ఈ ఏడాది జనవరి మొదటి వారం నుంచి ఎక్కువ శాతం పూతకొచ్చింది. ప్రతి ఏడాది నవంబరు నెలాఖరు, డిసెంబరు మొదటి వారంలోనే మామిడి పూతకు రావాల్సి ఉంది. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో గత ఏడు సంవత్సరాలుగా కొంత ఆలస్యంగానే పూత వస్తోంది. గత ఏడాది తరహాలోనే ఈ సారి డిసెంబరు ఆఖరు వారంలోనే పూత మొదలైంది.

పూత పూసిన తోటల్లో 75 శాతం తోటలు ప్రస్తుతం పిందె దశకు చేరుకున్నాయి. 15 శాతం తోటల్లో పిందెనిమ్మకాయ సైజుకు చేరుకుంది. మిగిలిన 10 శాతం తోటలు ప్రస్తుతం పూత దశకు చేరుకుంటున్నాయి. జనవరిలో పూతకొచ్చిన తోటలు ఏప్రిల్ నెలలో కోత దశకు చేరుకోనున్నాయి.

పూత, పిందె బాగా పట్టింది



నాకు ఐదు ఎకరాల్లో మామిడి తోట ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పూత, పిందె బాగా పట్టింది. గతంతో పోలిస్తే చీడ, పీడల ఉధృతి కూడా తక్కువగానే ఉంది. అకాల వర్షాలు రాకపోతే మంచి దిగుబడి వస్తుందని ఆశతో ఉన్నాం.

- రైతు లోకేష్, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

ఆశతోనే...



15 ఎకరాల్లో మామిడి పంటను లీజుకు తీసుకున్నా. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టా. గత ఏడాది ఆశించిన స్థాయిలో దిగుబడులు లేకపోవడంతో నష్టపోయాం. గత కొన్నేళ్లలో ఎన్నడూ లేని విధంగా పూత బాగా వచ్చింది. పూతను చూస్తే ఈ సారి దిగుబడి బాగా వస్తుందన్న ఆశతో ఉన్నాం. దిగుబడి బాగా వస్తే అప్పులు తీరుతాయి.

- రైతు లక్ష్మణమూర్తి, కుందుర్పి

సస్యరక్షణ చర్యలు తప్పని సరి



మామిడిలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే దిగుబడి బాగా వచ్చే అవకాశం ఉంది. గతంలోఎన్నడూ లేని విధంగా ఈ సారి పూత వచ్చింది. పూత, పిందె దశలోని తోటల్లో 5 నుంచి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను లీటరు నీటితో కలిపి చెట్లపై బాగా తడిసే విధంగా పిచికారి చేసుకోవాలి. అలాగే 2 మి.లీ క్వినాల్ ఫాస్ 2 మి.లీ హెక్సాకొనజోల్‌ను లీటరు నీటికి కలిసి చెట్లపై పిచికారి చేసుకోవడం ద్వారా పురుగులు, తెగుళ్ల సోకుండా నివారించవచ్చు. మామిడి పిందె గోళికాయ సైజులో ఉన్నప్పుడు 4 మి.లీ ప్లానోఫిక్స్‌ను 10 లీటర్ల నీటితో కలిసి చెట్లపై పిచికారి చేస్తే పిందెలు రాలిపోకుండా ఉంటాయి.

- చంద్రాయుడు, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త , కళ్యాణదుర్గం

797 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


బెళుగుప్ప, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 797 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 814 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.621 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

టమోటా కిలో రూ. 9



అనంతపురం రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 9తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 450 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 6 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ. 22వేలు



అనంతపురం రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 22,850 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 8,120, సరాసరి రూ. 11,500తో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 107 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

బతుకు'బండి' లాగాలని...

సాగితే బండి లేదంటే బండ అని పల్లెల్లో వాహనాల గురించి గ్రామీణుల ఉవాచ. అలాంటి బండి ఇసుక తిన్నెల్లో ఇరుక్కుపోతే.. దాన్ని బయటకు తీయడానికి తీవ్రంగా శ్రమించాల్సిందే. ఇలాంటి ఘటనలు బొమ్మనహాళ్ మండలంలోని సింగానహళ్లి గ్రామ సమీపంలోని వేదవతి హగరిలో నిత్యం జరుగుతుంటాయి. కల్లుదేవనహళ్లి, బండూరుగ్రామాల రోడ్డు నుంచి సింగానహళ్లి గ్రామానికి వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షానికి కోతకు గురైంది. దీంతో ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు నదిలోని ఇసుకలోనే వెళుతున్నాయి. సింగానహళ్లి గ్రామానికి చెందిన వ్యవసాయకూలీలు మిరప కోత కోసం రూపనగుడి, ఎత్తినబూదేహాళ్ తదితర ప్రాంతాలకు ఆటోలో వెళుతున్నారు. శ్రీధరఘట్ట, ఉప్పరహాళ్, ఉద్దేహాళ్ గ్రామాల మీదుగా వస్తే ఆటో వారికి దూరం అవుతుందని కూలీలు ఇచ్చే చార్జీలు గిట్టుబాటు కాదని ఆటో వారు కోతకు గురైన మార్గంలోని వెళుతున్నారు. బండి ఇసుకలో ఇరుక్కుపోతే కూలీలను కిందకు దింపి వారితోనే తోయిస్తున్నారు. పొట్టగడవాలంటే కూలి పనులకు వెళ్లక తప్పని స్థితిలో వారు కిక్కురుమనకుండా ఆటోను ఇసుక నుంచి బయటకు తోయడానికి అగచాట్లు పడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, బొమ్మనహాళ్)



ఆటో తోస్తున్న కూలీలు

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి


గొల్ల శివప్ప (ఫైల్)

గోరంట్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూచేపల్లిలో గొల్ల శివప్ప (38) అనే రైతు బోరుబావి వద్ద విద్యుదాఘాతానికి గురై శనివారం మృతి చెందాడు. శివప్ప స్వగ్రామం చిలమత్తూరు మండలం మొరంపల్లి. శివప్ప తల్లి పుట్టినిల్లు బూచేపల్లి కావడంతో చిన్నప్పటి నుంచి మేనమామలు నిజమాయలప్ప, రమణ వద్ద ఉంటున్నాడు. ముదిగుబ్బ మండలానికి చెందిన రేణుకతో పదేళ్ల క్రితం వివాహమయింది. వీరికి సంతానం లేరు. ఒక్కటిన్నర ఎకరా పొలంలో బోరువేసుకొని దంపతులు ఇద్దరూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వేరుశనగ సాగు చేయాలని భూమిని దుక్కి చేశాడు. విద్యుత్ స్తంభం వద్ద ఉన్న స్టాటర్ నుంచి సర్వీసు వైరు నేలపై ఉండటంతో కట్టెలపై అమర్చే ప్రయత్నం చేస్తుండగా వైరు తాకడంతో విద్యుత్ షాక్‌కి గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి దారుణహత్య

● పాతకక్షలా..? వివాహేతర సంబంధమా..?


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎస్ఐ లింగన్న

పుట్టపర్తి రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంగళమ్మచెరువు గ్రామానికి చెందిన కొత్తకోట నాగేష్ (34) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు, బంధువులు తెలిపిన మేరకు.. వెంగళమ్మచెరువుకు చెంది న నాగేష్‌ను శుక్రవారం రాత్రి ఎవరో ద్విచక్రవాహనంలో ఎక్కించుకు వెళ్లారు. బయటకు వెళ్లిన వ్యక్తి ఇం టికి రాకపోవడంతో అనుమానంతో కుటుంబసభ్యులు శనివారం ఉదయం రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి ఆచూకీ కో సం బంధువులు పోలీసులు గాలిం పు చర్యలు చేపడుతుండగా.. శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో అమగొండపాల్యం రోడ్డు సమీపంలోని మామిడితోటలో మృతదేహం ఉండటాన్ని గమనించిన పశువులు కాపరులు బంధువులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీంను రంగంలోకి దింపి విచారణ చేపట్టారు. మృతుడు నాగేష్‌కు భార్య సునీత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇతడు ట్రాక్టర్ బాడుగలకు తిప్పి జీవనం సాగించేవాడు. 25 ఏళ్ల క్రితం బుక్కపట్నం మండలం కొత్తకోట గ్రామంలో జరిగిన ఓ హత్యకేసుతో వీరి కుటుంబానికి సంబంధం ఉన్నట్లు తెలిసింది. అప్పుడే వీరి కుటుంబం కొత్తకోట గ్రామాన్ని వదిలి వెంగళమ్మచెరువుకు వచ్చి స్థిరపడింది. నాగేష్ హత్యకు పాతకక్షలు ఏమైనా ఉన్నాయా.. లేక వివాహేతర సంబంధం కారణమా అనే కోణాల్లో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

రెండు నాటు తుపాకుల స్వాధీనం

కణేకల్లు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సొల్లాపురం-కౌకుంట్ల గ్రామాల మధ్య శనివారం రెండు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగమధు తెలిపారు. సొల్లాపురం గాలిమరల వద్ద నాటు తుపాకులు ఉండగా అక్కడ పనిచేసే సిబ్బంది సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వెళ్లి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నాటు తుపాకులు ఎవరివనేవి సమాచారం లేదని, విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

సిగ్నల్ దాటిన రాయచూరు ప్యాసింజర్

● లోకో పైలెట్ సస్పెన్షన్..?

గుంతకల్లు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఓ ప్యాసింజరు రైలు రెడ్ సిగ్నల్‌ను దాటడంతో లోకో పైలెట్‌ను అధికారులు సస్పెండ్ చేసినట్లు తెలిసింది. శనివారం రాయచూరు-గుంతకల్లు ప్యాసింజరు రైలును ఇస్వి స్టేషన్ వద్ద రెడ్ సిగ్నల్‌ను దాటి నిలిపినట్లు సమాచారం. రైల్వే సేఫ్టీ నిబంధనల ప్రకారం రెడ్ సిగ్నల్ ఇచ్చిన చోట ఆ సిగ్నల్‌ను రైలింజన్ ఎట్టి పరిస్థితుల్లో దాటడానికి వీలులేదు. అలా రెడ్ సిగ్నల్‌ను కొంచెం దాటినా సిగ్నల్ పాస్ట్ అట్ డేంజర్ (స్పాడ్) కేసుగా లెక్కించి బాధ్యులైన లోకో పైలెట్, సహాయ లోకో పైలెట్‌పై చర్యలు తీసుకుంటారు. ప్యాసింజరు రైలు సిగ్నల్ దాటిన సంఘటనలో ఎల్పీ హేమంత్ కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

పత్తి రైతు చిత్తు..!

అరకొరగానే దిగుబడులు

పాతాళానికి ధర
నష్టానికి అమ్ముకోలేక ఇళ్లలోనే నిల్వ

పత్తి రైతులకు ఈసారి కష్టాలు తప్పడం లేదు. సకాలంలో వర్షం పడకపోవడం, తెగుళ్లతో అరకొరగానే దిగుబడి వచ్చింది. ఇదే క్రమంలో బహిరంగ మార్కెట్‌లో ధరలు అమాంతం తగ్గుముఖం పట్టాయి. అరకొర దిగుబడితో నష్టపోయిన రైతులు ధర కూడా తక్కువగా ఉండటంతో మరింత కుదేలవుతున్నారు. ధరలు తక్కువగా ఉండటంతో ఎక్కువమంది ఇళ్లలోనే పత్తి పంటను నిల్వ చేసుకున్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం అర్బన్/పామిడి


పామిడి మండలంలో నిల్వ చేసిన పత్తి దిగుబడి

పడిపోయిన ధర

ఖరీఫ్‌లో పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 48వేల హెక్టార్లుగా నిర్ణయించారు. జిల్లావ్యాప్తంగా 28వేల హెక్టార్లల్లో మాత్రమే పంట పెట్టారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం తగ్గింది. పెట్టుబడులు పెరగడం, తెగుళ్ల నివారణకు మందుల పిచికారీ కోసం ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి రావడం, మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో ధర లేకపోవడం తదితర కారణాలతో పత్తి సాగును రైతులు తగ్గించారు. కొందరు తమకున్న పొలంలో సగం పత్తి, మిగతా విస్తీర్ణంలో కంది, కొర్ర, పొగాకు తదితర పంటలు పెట్టారు. ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ఈసారి వర్షాభావ పరిస్థితులతోపాటు గులాబి రంగు తెగులు సోకడంతో పత్తి దిగుబడి తగ్గింది. వర్షా లు సకాలంలో పడితే ఎకరాకు 8 నుంచి 15 క్వింటాళ్లదాకా దిగుబడి వస్తుంది. ఈసారి 4 నుంచి 5 క్వింటాళ్లలోపే వచ్చింది. ధర తక్కువగా ఉండటంతో పత్తి పంటను ఎక్కువమంది రైతులు ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు. ఈసారి పంట సాగు విస్తీర్ణం తగ్గడంతో పాటు, పత్తి దిగుబడి అరకొరగానే వచ్చింది. అయినా ధర పెరగలేదు. కొందరు దళారులు కుమ్మక్కై ధరలు పెరగకుండా చేసి, రైతులను దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మూడే ళ్ల క్రితం క్వింటా పత్తి రూ.10వేలు పలికింది. రెండేళ్ల క్రితం క్వింటా నా ణ్యతను బట్టి పత్తి రూ.7వేల నుంచి రూ.8వేలదాకా ఉండింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో పత్తి నాణ్యతను బట్టి క్వింటా ధర రూ.5800 నుంచి రూ.6300 దాకా పలుకుతోంది.


గుత్తిలో ఖాళీగా పత్తి కొనుగోలు కేంద్రం

మద్దతు ధరతో కొనుగోలులో నిర్లక్ష్యం

పత్తి రైతుకు మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. ఏటా గుత్తి, తాడిపత్రి మార్కెట్ యార్డుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. ఈసారి కేవలం గుత్తి మార్కెట్ యార్డులో గతేడాది డిసెంబరు రెండోవారంనుంచి 25 రోజులపాటు తూతూమంత్రంగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతోనే సరిపెట్టారు. ఈసారి పత్తి క్వింటా మద్దతు ధర రూ.7561గా ప్రభుత్వం నిర్ణయించింది. 3,300 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయడంతోనే సీసీఐ అధికారులు సరిపెట్టారు. ఎక్కువశాతం పత్తి నాణ్యతగా లేదంటూ రైతులను వెనక్కి పంపినట్లు సమాచారం. ఆదోని, నంద్యాల, బళ్లారి మార్కెట్లకు జిల్లాలోని రైతులు పత్తి ఉత్పత్తిని తీసుకెళ్తున్నారు. అక్కడ క్వింటా పత్తి రూ.6500 పలుకుతున్నట్లు సమాచారం. రవాణా ఖర్చులు అదనంగా రైతుపై పడుతున్నాయి.

సాగు తగ్గించాం



ఏటా 30 ఎకరాల్లో పత్తి పంట సాగు చేసేవాళ్లం. రెండేళ్లుగా గిట్టుబాటు ధర దక్కట్లేదు. పంట సాగు, తెగుళ్ల నివారణకు పెట్టుబడి ఖర్చులు పెరిగిపో యాయి. దీంతో ఈసారి ఏడెకరాల్లోనే పంట పెట్టా. ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దిగుబడి తగ్గినా గిట్టుబాటు ధర మాత్రం పెరగడం లేదు. దీంతో నష్టపోతున్నాం.

- దేవేంద్రరెడ్డి, రైతు, రామరాజుపల్లి, పామిడి మండలం

ఇంట్లోనే నిల్వ చేసుకున్నాం



బహిరంగ మార్కెట్‌లో ఆశించిన మేర ధర లేకపోవడంతో పత్తి పంటను ఇంట్లోనే నిల్వ చేసుకున్నాం. రెండేళ్లుగా గిట్టుబాటు ధర లేదు. మా గ్రామంలో 2500 క్వింటాళ్ల పత్తిని రైతులు నిల్వ చేసుకున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలి. - రామలింగారెడ్డి, రైతు, గజరాంపల్లి, పామిడి మండలం

క్వింటా రూ.10వేలతో కొనుగోలు చేయాలి



ధరలు తక్కువగా ఉండటంతో రెండేళ్లుగా ఎక్కువమంది రైతులు ఇళ్లలోనే పత్తి దిగుబడులను నిల్వ చేసుకున్నారు. నాణ్యత ప్రమాణాల పేరుతో పత్తి పంటను కొనుగోలు చేయకపోవడం దారుణం. ఈసారి పంట సాగు విస్తీర్ణంతోపాటు దిగుబడి తగ్గినా ధరలు పెరగకుండా దళారులు కుమ్మక్కై రైతులను దోపిడీ చేస్తున్నారు. పత్తి క్వింటా రూ.10వేలతో కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- చంద్రశేఖర్ రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● పెళ్లైన నెలరోజులకే మృత్యువాత
● ఇంటర్ విద్యార్థికి తీవ్ర గాయాలు

కదిరి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పెళ్లి అయిన నెల రోజులకే రోడ్డు ప్రమాదం ఓ యువకుడిని బలిగొంది. ద్విచక్ర వాహనంలో వెళుతుండగా బస్సు ఢీకొనడంతో యువకుడు మృతి చెందగా.. ఇంటర్ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కదిరి మున్సిపాలిటి కుటాగుళ్లలోని పులివెందుల క్రాస్ వద్ద శనివారం ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మోటార్ సైకిల్‌లో వెళుతున్న దాదాపీర్(26) అక్కడికక్కడే మృతి చెందగా.. ఇంటర్ విద్యార్థి సయ్యద్ బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. కదిరి అడపాల వీధికి చెందిన దాదాపీర్ మడకశిర తపాలా కార్యాలయంలో పనిచేస్తున్నాడు. వరుసకు తమ్ముడైన నిజాం వలీ కాలనీకి చెందిన సయ్యద్ బాషా అనే ఇంటర్ విద్యార్థి స్థానిక బ్లూమూన్ కళాశాలలో పరీక్ష రాస్తున్నాడు. పరీక్ష అనంతరం కళాశాల నుంచి మోటార్ సైకిల్‌పై కదిరికి వస్తున్నారు. ఇదే సమయంలో కదిరి నుంచి ప్రొద్దుటూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు కుటాగుళ్లలోని పులివెందుల క్రాస్ వద్దకు రాగానే మోటార్ సైకిల్‌ను ఢీకొంది. దీంతో మోటార్‌సైకిల్ నడుపుతున్న దాదాపీర్ అక్కడిక్కడే మరణించగా సయ్యద్ బాషా తీవ్రంగా గాయపడ్డాడు. విద్యార్థిని 108 ద్వారా ప్రభుత్వ కదిరి ఆసుపత్రికి చేర్చారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.


దాదాపీర్(ఫైల్)

పెళ్లైన నెల రోజులకే..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దాదాపీర్ పోస్టల్ ఉద్యోగి. మడకశిరలో పనిచేస్తున్నాడు. పెళ్లై దాదాపు 40 రోజులయింది. దాదాపీర్ తల్లి, ఇంటర్ విద్యార్థి సయ్యద్ తల్లి అక్క, చెల్లెళ్లు. వరుసకు తమ్ముడైన సయ్యద్‌బాషా ఇంటర్ మొదటి రోజు పరీక్షకు బ్లూమూన్ కళాశాలకు వెళ్లాడు. పరీక్ష రాసిన సయ్యద్‌ను పిలుచుకు వస్తుండగా.. కుటాగుళ్ల వద్దకు జరిగిన ప్రమాదంలో దాదాపీర్ అక్కడిక్కడే మృతి చెందాడు. దాదాపీర్ మరణ వార్త తెలియగానే అతడి భార్య, తల్లి ఇతర బంధువులు ఆసుపత్రికి చేరుకున్నారు. శవాన్ని చూసి కన్నీరు, మున్నీరయ్యారు. పెళ్లైన నెలకే భర్త మరణించడంతో ఆమె రోదనలు ఆసుపత్రిలో మిన్నంటాయి. చేతికొచ్చిన కొడుకు ఉన్నట్టుండి చనిపోవడంతో విలపించిన తల్లిదండ్రులను చూసి బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

మొదటి పరీక్ష రాస్తూనే...

స్థానిక స్పేస్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సయ్యద్‌బాషా మొదటి రోజు పరీక్ష రాయడానికి బ్లూమూన్ కళాశాలకు వెళ్లాడు. పరీక్ష రాసి ఇంటికి వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురానికి తరలించారు. మొదటిరోజు పరీక్ష రాస్తూనే ప్రమాదం జరగడంపై తల్లిదండ్రుల రోదలనతో ఆసుపత్రి దద్దరిల్లింది.


గాయపడిన ఇంటర్ విద్యార్థి సయ్యద్ బాషా

విద్యా వృక్షం అనంతలక్ష్మి

● విశ్రాంత ఐఏఎస్ లక్ష్మీనారాయణ
● సాగునీటి సలహాదారు కన్నయ్య నాయుడు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులు

అనంతపురం సెంట్రల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కరువు జిల్లాలో అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల సాంకేతిక విద్యా వృక్షంగా వెలుగొందుతోందని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఫౌండర్ డైరెక్టర్, విశ్రాంత ఐఏఎస్ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఇరిగేషన్ విభాగం సలహాదారు కన్నయ్య నాయుడు అన్నారు. నగరంలోని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల 17వ వార్షికోత్సవంలో వారు పాల్గొని ప్రసంగించారు. కళాశాల ఛైర్మన్ అనంతరాముడు, వైస్ ఛైర్మన్ రమేష్ నాయుడు ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. అనంతపురం జేఎన్టీయూ రిజిస్ట్రార్ క్రిష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, రైతు కుటుంబం నుంచి వచ్చిన అనంతరాముడు పాఠశాల, కళాశాలలను ఏర్పాటు చేయడం హర్షణీయమని అన్నారు. విద్యలో రాశి కాదని, వాసి కూడా కావాలని అన్నారు. విద్యార్థులకు డిగ్రీ ఇచ్చి పంపడం కాదని, నైపుణ్యం పెంచి పంపాలని సూచించారు. లేకుంటే ద్రోహం చేసినవారౌతారని అన్నారు. వరదలు వచ్చినప్పుడు ప్రభుత్వ ఉద్యోగులే అన్ని పనులు చేయలేరని కన్నయ్య నాయుడు అన్నారు. రైతులు సంఘటితమై, ప్రభుత్వం ఇచ్చే నిధులతో కాలువలను బాగుచేసుకోవాలని సూచించారు. రాయలసీమలోని వ్యాసంపల్లి అనే చిన్నగ్రామంలో తాము ఉండేవారమని, తాను రైతు కుటుంబంలో జన్మించానని తెలిపారు. 1952లో కరువు చూశామని, ఆ సమయంలో బతికేందుకు ఒక గ్లాసు అంబలి ఇచ్చేవారని అన్నారు. తమ పెద్దలు చెప్పిన ప్రకారం 1935 నుంచే కరువు తాండవిస్తోందని, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల నుంచి చాలామంది పొట్ట నింపుకోవడానికి వలస వెళ్లారని గుర్తుచేసుకున్నారు. బెంగళూరు, మద్రాసు వంటి నగరాలకెళ్లి ఇళ్లలో పనిచేసేవారని అన్నారు. ఇంజనీరుగా తన అనుభవాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం క్రీడాపోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ట్రోఫీలు, ప్రసంశా పత్రాలను అందజేశారు.

నేడు ఉద్యాన శాఖ డైరెక్టర్ పర్యటన

అనంతపురం అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఉద్యాన శాఖ డైరెక్టర్ దేవమునిరెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఫెయిర్‌ట్రాసా కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ పాట్రిక్ స్ట్రూబి, ఉద్యాన శాఖ అధికారులతో కలిసి జిల్లాలో అరటి సాగు, ఎగుమతిపై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. రాప్తాడు మండలం రామినేపల్లిలో టిష్యూకల్చర్ అరటి ఉత్పత్తిని పరిశీలిస్తారు. పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట, పుట్లూరు మండలం సంజీవపురం, కడవకల్లులె అరటిని పరిశీలిస్తారు. తాడిపత్రి మండలం చుక్కలూరులో కోల్డ్ స్టోరేజీని పరిశీలించనున్నారు.

మన్నీల గ్రామ సమీపంలో సాగులో ఉన్న చీనీ, బెండ, దానిమ్మ పంటలు



క రెంటు ట.. ట..!

ఆ గ్రామాల్లో సాగునీరు పుష్కలం. చెరువులు నీటితో నిండుగా ఉన్నాయి. భూగర్భ జలాలకు ఇబ్బంది లేదు. బోర్లలో మునుపటి కంటే ప్రస్తుతం నీటి లభ్యత ఆశాజనకంగా ఉంది. అంతా బాగున్నా.. పంటలకు నీరందించేందుకు కరెంటు కష్టాలు వెంటాడుతున్నాయి. ఇన్నాళ్లు బోర్లలో నీటి కోసం అవస్థలు పడుతూనే.. పంటలను బతికించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం నీటి తిప్పలు లేకున్నా.. కరెంటు కష్టాలు రైతులను కలవర పరుస్తున్నాయి. కొన్ని రోజులుగా మండలంలోని ఆకుతోటపల్లి వ్యవసాయ ఫీడర్‌లో నిత్యం అంతరాయాలు ఏర్పడుతుండడంతో పంటలకు నీరందించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. - ఆంధ్రజ్యోతి, అనంతపురంరూరల్

ఆకుతోటపల్లి ఫీడర్‌లో నిత్యం అంతరాయాలు

వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు
పంటకు నీరందించేందుకు అన్నదాతల అవస్థలు

నిత్యం అంతరాయాలే..

ఆకుతోటపల్లి వ్యవసాయ ఫీడర్ పరిధిలోకి మన్నీల, కందుకూరు గ్రామాలు వస్తాయి. మన్నీల పరిధిలో 400, కందుకూరు పరిధిలో 200 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటికింద 8 వేల ఎకరాల్లో పంట లు సాగులో ఉన్నాయి. అందులోనూ ఉద్యా న పంటలే అధికం. వెయ్యి ఎకరాల్లో దాని మ్మ, చీనీ, ద్రాక్ష, అరటి వంటి పంటలు సాగు చేశారు. వ్యవసాయానికి కరెంటు సరఫరా సమయంలో లోడ్ ఎక్కువై నిత్యం సమస్యలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. తరచూ జంపర్లు తెగిపోతుండటం, ట్రాన్స్‌ఫార్మర్ల హెడ్ ఫీజులు కాలిపోవడం, ఓల్టేజీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ ఫీడర్ 35 నుంచి 40 కిలోమీటర్లు ఉండ టం కారణంగా జంపర్లు ఎక్కడ తెగిపోయాయో తెలుసుకోవడానికి లైన్ మొత్తం పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరమ్మతులు చేసి.. విద్యుత్ సరఫరా పునరుద్ధరించే సరికి గంటల సమయం పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో రోజూ రెండు, మూడు గంటలు పంటకు నీరందించేందుకు వీలులేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం చీనీ, దానిమ్మ పంటలు కాపు దశలో ఉన్నాయి. చాలినంత నీరు ఇవ్వకపోతే దిగుబడులపై ప్రభావం పడుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

అదనపు ఖర్చులతో మరింత నష్టం..

కరెంటు సరఫరాలో సమస్యలతో అదనపు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఉన్నఫళంగా కరెంటు పోవడం.. రావడంతోపాటు ఓల్టేజీ సమస్యలతో మోటార్లు కాలిపోతున్నాయి. స్టార్టర్ పెట్టెలో వైర్లు, మోటార్ల విద్యుత్ తీగలు కాలిపోవడం నిత్యకృత్యంగా మారాయి. పదిహేనురోజుల్లో వందకుపైగా మోటార్లు కాలిపోయినట్లు తెలుస్తోంది. బోరుబావుల్లోని మోటార్లు బయటకు తీసి, మరమ్మతులు చేసి.. మళ్లీ లోపలికి దింపాలంటే వేల రూపాయల ఖర్చుతో కూడుకున్న పని. మోటారు వైండింగ్, రవాణా ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఒకసారి మోటారు సమస్య తలెత్తితే.. మరమ్మతులకు రూ.10వేలకుపైగా ఖర్చవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జంపర్లు తెగిపోతే.. రోజంతా కరెంటు లేనట్లే

అరెకరాలో అరటి, నాలుగెకరాల్లో చీనీ, రెండెకరాల్లో పశుగ్రాసం సాగు చేశా. కరెంటు సమస్య తీవ్రమైంది. లోడ్ ఎక్కువైపోయి జంపర్లు తెగిపోతున్నాయి. వాటికి మరమ్మతులు చేసి, తిరిగి అమర్చే సరికి ఆ రోజంతా వృథా అవుతోంది. దీంతో పంటలకు నీరివ్వలేని పరిస్థితి తలెత్తుతోంది. సబ్‌స్టేషన్ కోసం ఎన్నోసార్లు అధికారులకు విన్నవించాం. స్థలం లేదంటూ అధికారులు దాటవేస్తున్నారు. - సీవీ కొండయ్య, రైతు, మన్నీల గ్రామం

పంటలపై ప్రభావం: బయన్న, రైతు, మన్నీల గ్రామం



ఐదెకరాల్లో చీనీ, దానిమ్మ పంటలు సాగులో ఉన్నాయి. ప్రస్తుతం పంటలు చేతికొచ్చే దశలో ఉన్నాయి. లక్షలు పెట్టుబడి రూపంలో పెట్టా. ఇలాంటి సమయంలో కరెంటు అంతరాయాలు ఆందోళన రేపుతున్నాయి. కరెంటు ఎప్పుడొసుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. దీంతో పంటలకు సక్రమంగా నీరివ్వలేకపోతున్నాం.

సబ్‌స్టేషన్ కోసం ఎదురుచూపు



విద్యుత్ సమస్య పరిష్కారానికి సబ్‌స్టేషన్ ఏర్పాటు ఒక్కటే మార్గం అన్న అభిప్రాయాలు ఆయా గ్రామస్థులు, రైతుల నుంచి వినిపిస్తున్నాయి. కొన్నేళ్లుగా సబ్‌స్టేషన్ కోసం రైతులు.. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల సబ్ స్టేషన్ మంజూరైనట్లు సమాచారం. స్థలం చూపితే సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడతామని విద్యుత్ అధికారులు అంటున్నట్లు రైతులు చెబుతున్నారు. గ్రామ పరిధిలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు తగినంత ప్రభుత్వ స్థలం లేకపోవడం సమస్యగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు సబ్‌స్టేషన్ ఏర్పాటుకు చొరవ చూపాలని రైతులు అంటున్నారు.

న్యూస్ బాక్స్

గురుకుల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గార్లదిన్నె, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఏపీఆర్ఎస్ మైనార్టీ గురుకుల విద్యాలయం ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అంజినేయులు నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులు ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదో తరగతి ప్రవేశానికి, 6, 7, 8 తరగతులలో మిగిలిన సీట్లకు, ఇంటర్మీడియట్, డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఉద్యోగ బాధ్యతల స్వీకరణ

అనంతపురం న్యూటౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ శాఖ కార్యాలయం సూపరింటెండెంట్‌గా రమేష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడే సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న రమేష్ సాధా రణ బదిలీల్లో బాగంగా తిరుపతికి వెళ్లారు. అయితే ఉద్యోగోన్నతుల్లో భాగంగా ఆయనను జిల్లా అటవీశాఖ కార్యాలయం సూపరింటెండెంట్‌గా నియమిస్తూ మూడో రోజుల కిందట అప్పటి పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన జిల్లా అటవీశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అశోక్‌నాయక్

చెన్నేకొత్తపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అశోక్‌నాయక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. సీకేపల్లి ఎంపీడీఓగా పనిచేసిన శివశంకరప్ప శుక్రవారం పదవీ విరమణపొందారు. దీంతో మండల ఈఓఆర్‌డీగా పనిచేస్తున్న అశోక్‌నాయక్‌కు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నియమించారు.

మాజీ మంత్రి పల్లె ఇంటికి హోంమంత్రి



హోంమంత్రి అనితను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

అనంతపురంరూరల్,మార్చి1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు రోడ్డులో ఉన్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఇంటికి రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత వెళ్లారు. జిల్లా పర్యటనలో బాగంగా శనివారం నగరానికి వచ్చిన ఆమె ఎమ్మెల్యే ఎంఎస్ రాజుతో కలసి మాజీ మంత్రి పల్లె ఇంటికి వెళ్లారు. పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, పీవీకేకే విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ దంపతులు హోంమంత్రికి పుష్ప గుచ్ఛాలు అందజేసి ఆహ్వానించారు. పల్లె నివాసంలో మంత్రికి తేనీటి విందు ఏర్పాటు చేశారు. పుట్టపర్తి నియోజకవర్గంలో నూతన పోలీస్ స్టేషన్లు, పోలీస్ సిబ్బంది కొరత ఉన్నట్లు ఎమ్మెల్యే సింధూరరెడ్డి హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

అంతర్జాతీయ సదస్సులో జిల్లా కోచ్



అంతర్ జాతీయ సదస్సులో సర్టిఫికెట్ అందుకుంటున్న నళిని

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సదస్సుకు జిల్లాకు చెందిన కురాష్ కోచ్ నళిని హాజరయ్యారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం షహరాన్‌పూర్‌లో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ కురాష్ రెఫరీ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ తరఫున జిల్లాకు చెందిన నళిని ప్రాతినిధ్యం వహించారు. కురాష్ ఇంటర్‌నేషనల్ సెక్రటరీ మహ్మద్ ఆర్ నస్రీ, నేషనల్ ప్రెసిడెంట్ రవికపూర్ చేతుల మీదుగా నళిని వన్‌స్టార్ రెఫరీ సర్టిఫికెట్ అందుకున్నారు. దీంతో కురాష్ క్రీడలో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రెఫరీగా పనిచేసే అవకాశం నళినికి దక్కింది.

ఘనంగా చైతన్య పాఠశాల వార్షికోత్సవం



వార్షికోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నేటితరం విద్యార్థులు టెక్నాలజీ పరంగా అద్భుత ఆలోచనలు కలిగి ఉన్నారని అన్నారు. వారి ఆలోచనలకు అనుగుణంగా శ్రీచైతన్య పాఠశాలలో పాఠ్య ప్రణాళికతో ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి ఉందని అన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో 21 బ్రాంచ్‌లు ఉన్నాయని అన్నా రు. కదిరి పురప్రజల సహకారంతో పాఠశాలను విజయవంతంగా నడుపుతున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్స్ శ్రీనివాసరెడ్డి ,సమీనాఖాన్, విశ్వనాథ్, తిరుమలేష్‌రెడ్డి, డీన్ హరినారాయణ, ప్రైమరీ ఇన్‌చార్జ్ అనిత, సబిత, లక్ష్మీనారాయణ, అమ్మాజాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామకృష్ణ పరమహంస జయంతి

అనంతపురం కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఎల్‌సీ కాలనీలోని రామకృష్ణ సేవాసమితి ప్రాంగణంలో శనివారం భగవాన్ రామకృష్ణ పరమహంస 190వ జయంతి వేడుకలను ఘ నంగా నిర్వహించారు. చిన్మయామిషన్ ప్రతినిధి స్వామి ఆత్మవిదానంద సరస్వతి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మధ్యాహ్నం అన్నదాన వినియోగం చేశారు.

స్కేటింగ్‌లో ఎరా స్కూల్ విద్యార్థుల సత్తా



పతకాలు సాధించిన విద్యార్థులతో చిరంజీవిరెడ్డి తదితరులు

అనంతపురం రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): స్కేటింగ్ పోటీల్లో రాచానపల్లి సమీపంలోని ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను శనివారం విద్యాసంస్థల అధినేత చిరంజీవిరెడ్డి అభినందించారు. ఈసందర్భంగా చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి మాట్లాడుతూ.. గత నెల 23న గోవాలోని మీరమ్మార్ బీచ్ సమీపంలోని రోలర్ రిలే స్కేటింగ్ ఫెరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్ -4 నుంచి 16వరకు నిర్వహించిన స్కేటింగ్ పోటీల్లో, తమ స్కూల్ నుంచి 18మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇద్దరు స్వర్ణ పతకాలు, ఏడుగురు కాంస్యం, తొమ్మిది మంది రజత పతకాలు సాధించారని తెలిపారు. విద్యార్థులకు క్రీడలపట్ల మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు.

ఘనంగా శివుడికి త్రిశూల స్నానం



త్రిశూల స్నానం చేయిస్తున్న వేద పండితులు

అనంతపురం కల్చరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఫిబ్రవరి 19వ తేదీ నుంచి నిర్వహిస్తున్న మహా శివ రాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం నాటికి ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం కాశీవిశ్వేశ్వరుడికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు త్రిశూలస్నానం, వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. అలాగే ఆలయ సిబ్బంది, భక్తులు వసంతోత్సవం జరుపుకున్నారు. భక్తిశ్రద్ధలతో రుద్రహోమం చేసి, మహా పూర్ణాహుతి సమర్పించారు. తదనంతరం ధ్వజావరోహణ చేశారు. రాత్రి ఆలయంలో శివపార్వతుల ఉత్సవమూర్తులకు శయనోత్సవ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, నరేంద్ర చౌదరి, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి సమర్పిస్తున్న దృశ్యం

మేమంటే ఎందుకంత మంట..?

● క్రీడాకారులు, కోచ్‌ల ఆందోళన



క్రీడాకారులు, కోచ్‌లను అడ్డుకుంటున్న పోలీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పోలీసులకు క్రీడలంటే సరిపోవా లేక క్రీడాకారులు, కోచ్‌లంటే సరిపోరా... ఎందుకింత మంట అంటూ అటు క్రీడాకారులు, ఇటు కోచ్ లు ధ్వజమెత్తారు. 'ఇక్కడి నుంచి వెళ్లిపోండి' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథ నానికి క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడాసంఘాల ప్రతినిధులు స్పందించారు. శనివారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను కలిసి తమ గోడు వెళ్లగక్కేందుకు స్థానిక సప్తగిరిసర్కిల్‌లోని అలెగ్జాండర్ హోటల్ వద్దకు చేరుకున్నారు. అయితే హోంమంత్రిని కలిసేందుకు అనుమతి లేదంటూ పోలీసులు హైరానా చేశారు. హోంమంత్రి వద్దకు వెళ్ల డానికి వీల్లేదంటూ క్రీడాకారులు, కోచ్‌లను పోలీసులు తోసేశారు. తమ బాధలను చెప్పుకోవడానికి వస్తే పోలీసులు ఓవరాక్షన్ ఏంటని కోచ్‌లు, క్రీడాకారులు నిలదీశారు. ఇంతలోనే హోటల్ నుంచి బయటకు వచ్చిన హోంమంత్రిని కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ఉమ్మడి జిల్లా కేంద్రంగా ఉన్న అనంతపురం లోని నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ప్రాక్టీస్ చేసుకుంటూ, ఆటలు ఆడుతున్నామని మంత్రికి విన్నవించారు. అయితే ప్రస్తుతం పీటీసీ వైస్ ప్రిన్సిపాల్‌గా వచ్చిన కోటిరెడ్డి నీలం సంజీవరెడ్డి స్టేడియం పీటీసీకి చెందినది, ఇందులోకి ఎవరినీ అను మతించేదిలేదు, వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోండి అంటూ తమ క్రీడా సామగ్రిని గేటు బయటకు వేశారని తెలిపారు. అక్కడ ఏర్పాటు చేసుకున్న ప్రాక్టీస్ సామగ్రిని ఎక్స్‌కవేటర్‌తో తొలగించారని వాపోయారు. ఈ స్టేడియం సుమారు 60 ఏళ్లుగా ఎన్నో క్రీడా పోటీలకు వేదికగా నిలిచిందని, ఎంతోమందిని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దిందని విన్నవించారు. అటు వంటి స్టేడియం నుంచి పోలీసులు దౌర్జన్యంగా తమను గెంటేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడాకారుల సాధనకు, కోచింగ్, వాకింగ్‌కు, క్రీడలకు అనుమతివ్వాలని కోరారు. అంతేగాక క్రీడాకారులను బయటకు గెంటేసిన పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ కోటిరెడ్డిపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేలా పోలీసు అధికారి కోటిరెడ్డి వ్యవహరిస్తున్నారని, వెంటనే ఆయనను అక్కడ నుంచి పంపించే యాలని కోరారు. వాకర్స్ నుంచి డబ్బు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. యథావిధిగా నీలం సంజీవరెడ్డి స్టేడియంలో వాలీబాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, కబడ్డీ, పారా అథ్లెటిక్స్, క్రికెట్ కోచింగ్‌తో పాటు పోటీల నిర్వహణకు అనుమతివ్వాలని కోరారు. దీనికి హోంమంత్రి స్పందిస్తూ వెంటనే పరిశీలించి క్రీడాకారులు, కోచ్‌లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో క్రీడాకారులు, కోచ్‌లు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ఏపీ వెటరన్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మచ్చా రామ లింగారెడ్డి, కమలాకర్ నాయుడు, శాప్ కోచ్‌లు అనిల్ కుమార్, మంజుల, సంధ్య, క్రికెట్ కోచ్ చంద్రమోహన్ రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్ మోసపూరితం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం క్రైం మార్చి 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మోసపూరితమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి విమర్శించారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలను గాలికి వదిలేశారన్నారు. బాబు బడ్జెట్‌లో బాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ అని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ పరిశీలిస్తే ఇది కూటమి ప్రభుత్వం కాదని కోతల ప్రభుత్వమని స్పష్టమవుతోందన్నారు. వృద్ధాప్య పింఛన్లు, తల్లికి వందనం పథకాల్లో భారీ కోత విధించారన్నారు. మహిళలకు నెలకు రూ. 1500 అన్నారని కానీ నిధులు కేటాయించలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ఎప్పుడు అమలు అవుతుందన్నారు. ధరల స్థిరీకరణ కింద రైతును ఆదుకునేందుకు కేటాయించిన రూ. 300 కోట్లు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులను దారుణంగా మోసం చేశారని, పెండింగ్ డీఏలు ఇవ్వలేదన్నారు. జాబ్‌క్యాలెండర్ ప్రకటించలేదు, నిరుద్యోగ భృతి ఇవ్వలేదన్నారు. బడ్జెట్‌లో రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టులపై శీతకన్ను వేశారన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం



మోక్షిత్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీసీ శైలజ

అనంతపురం విద్య, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు స్కూళ్లలో శనివారం సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. చిన్నారులు తయా రు చేసిన నమూనాలు ఆకట్టుకున్నాయి. నగరంలోని మోక్షిత్ స్కూల్‌ను సమగ్రశిక్ష ప్రాజక్టు ఏపీసీ శైలజ సందర్శించారు. సైన్స్ డేలో భాగంగా చిన్నారులు చేసిన పలు ప్రాజక్టు నమూనాలను ఆమె పరిశీలించి అభినందించారు. కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నగర శివారులోని సెయింట్ విన్సెంట్ డీ పాల్ స్కూల్‌లో విద్యార్థులు చేసిన సైన్స్ నమూనాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ శౌరిలు, డాక్టర్ శాంత సిస్టర్ జ్ఞానేశ్వరి, ప్రధానోపాధ్యా యురాలు అమల తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం రూరల్ : మండలంలోని ఎ. నారాయణపురంలో ఉన్న ఏబీసీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన పలు నమూనాలను ప్రదర్శించారు. కరస్పాండెంట్ రాగసుధ, ప్రధానో పాధ్యాయులు అన్నపూర్ణ, ఉపాధ్యాయులు కవిత, శైలజ, వనిత తదితరులు పాల్గొన్నారు.



విన్సెంట్ డీ పాల్ స్కూల్‌లో విద్యార్థుల నమూనాలు



ఏబీసీ స్కూల్‌లో నమూనాలను పరిశీలిస్తున్న కరస్పాండెంట్ రాగసుధ

హౌసింగ్ ఇంజనీర్‌కు షోకాజ్ నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ ఇంజనీరుకు ఆ శాఖ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 'తవ్వేకొద్దీ అక్రమాలు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి లో ప్రచురితమైన కథనానికి హౌసింగ్ అధికారులు స్పందించారు. రాప్తాడులో ఇంజనీరు రామమూర్తి ఇన్‌చార్జ్ డీఈగా ఉన్న సమయంలో జరిగిన అవినీతి, అక్రమాల ఆరోపణలపై వారం లోగా వివరణ ఇవ్వాలని హౌసింగ్ పీడీ శైలజ ఈ మేరకు ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అప్పట్లో రాప్తాడు ఇన్‌చార్జ్ డీఈగా పనిచేసిన ఇంజనీరు రామమూర్తి ప్రస్తుతం బుక్కరాయసముద్రం ఏఈగా ఉంటూ శింగనమల ఇన్‌చార్జ్ డీఈగా విధులు నిర్వహిస్తున్నారు. అప్పటి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన ఇనుము, సిమెంట్ అక్రమంగా విక్రయించుకుని సొమ్ము చేసుకోవడంలో ఆ ఇంజనీరు పాత్రపై ఆరోపణలు వచ్చాయి. ఇదే అంశంపై ఇప్పటికే హౌసింగ్ అధికారులు విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు.

పిల్లలను ఉన్న పాఠశాలలోనే కొనసాగించండి

● తల్లిదండ్రుల నిరసన

చెన్నేకొత్తపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి):పాఠశాల విలీనం తమకొద్దని, తమ పిల్లలను ప్రస్తుతం ఉన్న పాఠశాలలోనే కొనసాగించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని న్యామ ద్దల గ్రామంలో శనివారం స్థానిక ఎస్సీ కాలనీలోని పాఠశాలలో 1వతరగతి నుంచి 5వ తరగతి వరకు 55 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే పాఠశాల విలీన ప్రక్రియలో భాగంగా స్థానికంగా ఉన్న ప్రభుత్వ మెయిన్ పాఠశాలలోకి విలీనం చేయడంపై పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. అయితే ఇక్కడ నుంచి పాఠశాలను తరలించకూడదని వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశం నుంచి బయటకు వచ్చి పాఠశాల గేటు ఎదుట తమ పిల్లలతో కలిసి ప్లకార్డులతో నిరసనకు దిగారు. తమ కాలనీ నుంచి మెయిన్ పాఠశాలకు తమ పిల్లలు వెళ్లాలంటే అనుకూలంగా లేదన్నారు. కావున అధికారులు నిర్ణయాన్ని మార్చుకుని, ఉన్న పాఠశాలలోనే యథావిధిగా కొనసాగించాలన్నారు. లేకపోతే ఆందోళన చేపడుతామనిహెచ్చరించారు.

ముస్లింలకు కూటమి పెద్దపీట: ఐఎంఎం

అనంతపురం కల్చరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృ ద్ధికి పెద్దపీట వేస్తోందని ఇండియన్ ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ (ఐఎంఎం) రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లీం మైనార్టీలకోసం రూ. 5434కోట్లు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఐఎంఎం ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. గత వైసీపీ ప్రభు త్వం మైనార్టీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేస్తే, టీడీపీ ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించి సంక్షేమానికి కృషి చేస్తుండడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు జాకీర్ హుస్సేన్, ముక్తియార్, జాకీర్, టిప్పు సుల్తాన్, హుసేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు రూ.74వేల కోట్లు కేటాయించాలి

● ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ ఎస్టీల సంక్షేమానికి సబ్‌ప్లాన్ చట్టం-2013 ప్రకారం రూ.74వేల కోట్లు నిధులు కేటాయించాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను కలిసిన ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం కేంద్రకమిటీ సభ్యులు సోమశేఖర్, రామచంద్ర, జయరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

భయపెడుతున్న మానసిక జబ్బు

● డాక్టర్ సవితమల్హోత్ర

అనంతపురం టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజాన్ని మానసిక జబ్బు భయపెడుతోందని మానసిక వైద్య సంఘం జాతీయ అధ్యక్షురాలు డాక్టరు సవితమల్హోత్ర ఆందోళన వ్యక్తం చేశారు. రూరల్ పరిధిలోని ఆర్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం మానసిక వైద్యుల సదస్సును డాక్టరు ఎండ్లూరి ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సవితమల్హోత్ర ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేడు ప్రతిఒక్కరు ఏదో ఒక ఒత్తిడితో జీవనం సాగిస్తున్నారన్నారు. మానసిక వైద్యులు ఆయా జనాల్లో ఉన్న భయాన్ని తొలగించాలని సూచించారు. ఆస్పత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావు, వివిధ రాష్ట్రాల మానసిక వైద్యులు, అనంత జిల్లా డాక్టర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, వెంకట శివుడు యాదవ్

అనంతపురం రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యమిస్తూ రూ.3. 22లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టడం రాష్ట్ర చరిత్రలో ఇది తొలిసారి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మం డలంలోని రుద్రంపేట పంచాయతీలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, నాయకులు, సచివాలయ ఉద్యోగులు తదితరులతో కలసి ఆయన శనివారం ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పింఛన్‌దారులనడి వారి స్పందన తెలుసుకున్నారు. అనంతరం చంద్రబాబుకొట్టాల్లో ఎమ్మెల్యే సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్‌ను వారు ప్రారంభించారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు పరమేష్, పీఎల్ఎన్ మూర్తి, కొండన్న, నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, నాయకులు రమేష్, భక్తవత్సలం నాయుడు, మారుతి నాయుడు, ఎస్ఎం బాష, ఈడిగ నాగభూషణం, ఖాసిం, పెద్దన్న, బాలప్ప, గోపాల్ గౌడ్, కదిరప్ప, రాయల్ మధు, వెంకటరాముడు, అంజి, జయ రామ్‌నాయక్, పోతలయ్య, ఆది, సైపుద్దీన్, ఇస్మాయిల్, ఓంకార్‌రెడ్డి, మధు, తెలుగుమహిళలు స్వప్న, సంగా తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో అనర్హులకే పింఛన్లు

● ఎమ్మెల్యే పరిటాల సునీత



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

అనంతపురం రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ హయాంలో దివ్యాంగుల పింఛన్లు అనర్హులకు ఎక్కువగా అందాయని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలం లోని కక్కలపల్లి కాలనీ పంచాయతీలోని సుందరయ్య కాలనీలో ఆమె పింఛన్లు పంపిణీ చేశారు. ఈఓఆర్డీ వెంకటనాయుడు, మండల కన్వీనర్ జింకా సూర్య నారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పామురాయి రఘు, మాజీ మండల కన్వీనర్ చల్లా జయకృష్ణ, సీనియర్ నాయకులు పతకమూరి శ్రీనివాసులు, మాజీ సర్పంచు సుశీలమ్మ తదితరులతో కలసి ఆమె ఇంటింటికి వెళ్లి, లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించారన్నారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి పవన్ కుమార్, కూటమి నాయకులు బొట్టు రామాంజి, రామకృష్ణ, కమాల్‌బీ, బాబా, రాజేంద్ర, చెన్నప్ప, ఇమాముల్, ఈడిగ సూరి, రామాంజినేయులు, లింగయ్య, అల్లీపీర, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పంపిణీ చేయండి : ఆర్డీఓ

నార్పల/శింగనమల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీని ప్రభు త్వం ప్రతిష్టా త్మకం గా చేపట్టిందని, సిబ్బంది బాధ్యతగా నిర్వర్తించాలని ఆర్డీఓ కేశవనాయుడు సూచించారు. ఆయన శనివారం నార్పలలోని మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పింఛన్ల పంపిణీ తీరును పరిశీలించారు. అలాగే శింగనమల: మండలంలోని నాగులగుడ్డం, నాగులగుడ్డం తండా గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఆర్డీఓ కేశవనాయుడు శనివారం తనిఖీ చేశారు.

● గార్లదిన్నె: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శనివారం మండలంలో 95.84 శాతం పూర్తి అయినట్లు ఎంపీడీఓ యోగానంద రెడ్డి తెలిపారు. పంపిణీ కార్యక్రమాన్ని ఉదయం 7 గంటల నుంచి ప్రారంభించారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఈఓఆర్డీ దామోదరమ్మ, వివిధ ఉద్యోగులతో పాటు సచి వాలయం సిబ్బంది పాల్గొన్నారు.

● నార్పల: మండలంలోని బొందలవాడ గ్రామంలో కొత్తగా మంజూరైన స్పౌస్ పింఛన్‌ను ఉప సర్పంచు ఆలం వెంకట నరసానాయుడు శనివారం అందజేశారు.

లింగ నిర్ధారణపై నిఘా ఉంచాలి : కలెక్టర్

అనంతపురంటౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : స్కానింగ్ సెంటర్లపై నిరంతరం నిఘా ఉంచి, చట్ట విరుద్ధమైన లింగ నిర్ధారణ చేసే వాటిపై చర్యలు తీసుకోవాలని కలెక్టరు వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గర్భస్థ లింగనిర్ధారణ నిషేధితచట్టం అమలుపై ఆయన శనివారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. చట్ట విరుద్ధంగా గర్భస్థ లింగనిర్ధారణ చేసే వారి సమాచారాన్ని తెలుసుకోవడానికి టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటుచేయాలన్నారు. సమీక్షలో డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీ దేవి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శిల్పారామం అభివృద్ధికి కృషి

● రాష్ట్ర చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్వామి నాయుడు

అనంతపురం రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సందర్శకులను మరింత ఆకర్షించేలా స్థానిక శిల్పారామాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర శిల్పారామం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్వామి నాయుడు పేర్కొన్నారు. మండలంలోని శిల్పారామాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం ఏఓ క్రిష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీలో తేడాలొస్తే చర్యలు: జేసీ

అనంతపురం టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : పేదలకోసం ప్రభుత్వం అందిస్తున్న నిత్యవసర సరకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టరు శివనారాయణ్ శర్మ హెచ్చరించారు. ఆయన శనివారం నగరంలో పర్యటించారు. తొలుత పింఛన్ల పంపిణీచేపట్టారు. అనంతరం నాయక్‌నగర్‌లో సరకులు పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాన్ని తనికీచేశారు.

సంక్షిప్త వార్తలు

7 నుంచి లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

యాడికి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని, వాటిని అంగరంగవైభవంగా నిర్వహిస్తామని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉత్సవాల పర్యవేక్షకులు గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు గ్రామస్థులంతా సహకరించాలని కోరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. ఉత్సవాల ప్రారంభం నుంచి ముగింపు వరకు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. తర్వాత అంగళ్ల ఏర్పాటు చేసే కుంట స్థలాన్ని పరిశీలించారు. సమావేశంలో ఆలయ అర్చకులు హరికృష్ణశర్మ, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, దేవాదాయ శాఖ ఈఓ దుర్గాప్రసాద్, టీడీపీ నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి, ఎస్వీ రవీంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బెస్తరపల్లిలో జాతర ప్రారంభం

కుందుర్పి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తరపల్లి గ్రామంలో వంద ఏళ్ల అనంతరం యాదవ కులస్థులు జాతరను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక బొమ్మలింగేశ్వర, క్యాతిలింగేశ్వర, ఈరన్న స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ధ్వజస్తంభ అధిరోహణ నిర్వహించారు. ఈ పూజల్లో టీడీపీ నాయకుడు ధర్మతేజ పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. మూడురోజులు జరిగే జాతరకు భారీ సంఖ్యలో జనం వస్తారని, ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. యాదవ కులపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బెళుగుప్ప, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రారంభమైనందున ఎండవేడికి ప్రజల దాహార్తిని తీర్చేందుకు మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లు చలివేంద్రం ఏర్పాటు చేశారు. దానిని ఎస్ఐ శివ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేసవి కాలం ముగిసే వరకు ఇక్కడ తాగునీరు అందించాలని ఆటోడ్రైవర్లకు సూచించారు. హెచ్‌సీ బాల నరసింహులు, కానిస్టేబుల్ నాగభూషణ, డ్రైవర్లు అక్కులప్ప, కేశవరెడ్డి, రమేష్, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

సరళ మృతికి పలువురి నివాళి



భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వెంకట శివుడు యాదవ్

పామిడి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మా మోహన్‌కృష్ణ సతీమణి సరళ గత శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె భౌతిక కాయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ శనివారం సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆమె భర్త మోహన్‌కృష్ణను ఓదార్చారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, పలువురు ఎంపీటీసీ మాజీ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

టెక్ కళాశాలకు అటానమస్ గుర్తింపు

తాడిపత్రి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాలకు యూజీసీ అటానమస్ స్థాయి గుర్తింపు వచ్చిందని కళాశాల సెక్రెటరీ సురేష్‌రెడ్డి శనివారం తెలిపారు. 2025-2026 విద్యాసంవత్సరం నుంచి కళాశాలకు ఈ గుర్తింపు అందుబాటులోకి వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, డైరెక్టర్ నటరాజేశ్వర్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ భానుప్రసాద్ పాల్గొన్నారు.

టీ దుకాణాల్లో చోరీ

గుత్తి,మార్చి1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండు టీ దుకాణాల్లో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. స్టేట్‌బ్యాంక్ సమీపంలో ఉన్న దశరథరామిరెడ్డి టీ దుకాణంలో, బాలాజీ లాడ్జి సమపంలో ఉన్న చంద్రశేఖర్‌రెడ్డి టీ దుకాణంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. వాటికి ఉన్న తాళాలు పగులకొట్టి లోపలకి ప్రవేశించి రూ. 10వేల నగదు, విలువైన సిగరెట్లను అపహరించినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వింతతువులకు నెలకే పింఛన్ల మంజూరు

గుత్తి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 22వ వార్డులో భర్త చనిపోయిన నెలకే భార్యకు పింఛన్ మంజూరైంది. 22వ వార్డులో నివాసముంటున్న దస్తగిరి నెల కిందట మరణించగా ఆయన భార్య గౌసియాకు ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పింఛన్ అందజేయాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచించారు. ఆ మేరకు పింఛను మంజూరు కాగా.. సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు ఆమె ఇంటికి వెళ్లి పింఛన్ నగదును అందజేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, నాయకులు శీనా, సుంకన్న, వీఆర్వోలు, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

కణేకల్లు: మండల కేంద్రంలో కేశవులు అనే వ్యక్తి నెలక్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. అయితే అతడి భార్య రత్నమ్మ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా.. మంజూరైంది. ఆమెకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు అనిల్, నాయకుడు అబ్దుల్ సచివాలయ సిబ్బంది పింఛన్ సొమ్మును అందజేశారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని బాల వెంకటాపురానికి చెందిన హరిజన లక్ష్మక్క భర్త, బోయ సాకమ్మ భర్త నెలక్రితం మృతి చెందారు. దీంతో లక్ష్మక్క, సాకమ్మ వితంతు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోగా వెంటనే మంజూరయ్యాయి. టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు నాయకులు రామ్మోహన్ చౌదరి వారి ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ సొమ్మును పంపిణీ చేశారు.

బేటీ బచావో, బేటీ పడావో

ఉరవకొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళ వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని సెంట్రల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి కుష్బూకొఠారి, సీడీపీవో శ్రీదేవి విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బందితోకలిసి సైకిల్‌ర్యాలీ చేపట్టారు. తర్వాత మానవహారంగా ఏర్పడ్డారు. సీడీపీవో మాట్లాడుతూ బాలికలు పుస్తకాలు మోసే వయస్సులో, పుస్తెలు మోయడం సరికాదన్నారు. చదువుతోనే భవిష్యత్తు ఉంటుందన్నారు. కనుక ప్రతిబాలిక చదువుకోవాలని సూచించారు. ఏసీడీపీవో యల్లమ్మ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తకు సీఎం సహాయ నిధి మంజూరు

● చొరవ చూపిన ఎమ్మెల్యే అమిలినేని



బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేస్తున్న ధర్మతేజ

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాల వెంకటాపురం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త జిలాన్ బాషా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని కొద్దిరోజుల కిందట కుటుంబ సభ్యులు, గ్రామ టీడీపీ నాయకులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆపరేషన్ కోసం రూ. 20 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారని, ఆదుకోవాలని బాధితుడి కుటుంబసభ్యులు విలపించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సీఎంఆర్‌ఎఫ్ నుంచి సాయం చేయిస్తానని, ధైర్యంగా వుండాలని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ. పది లక్షలు మంజూరవగా.. అందుకు సంబంధించిన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే మేనల్లుడు దేవినేని ధర్మతేజ, గ్రామ టీడీపీ నాయకులు శనివారం బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

మనవూరి కుర్రోళ్లు.. ఎస్‌ఐలు అయ్యారు

● రమణేపల్లి, బ్రాహ్మణపల్లి తండాల్లో గ్రామస్థుల సంబరాలు



ఎస్ఐ ఉద్యోగాలు పొందిన కాలువపల్లి వడ్డే అశోక్, దుద్దేకుంట దబ్బర అనిల్ కుమార్

బెళుగుప్ప, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మనవూరి అబ్బాయిలు ఎస్‌ఐలు అయ్యారంటూ మండలంలోని రమణేపల్లి, బ్రాహ్మణపల్లి తండాలలో గ్రామస్థులు సంబరాలు చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఆ ఇద్దరు యువకులు ఎస్ఐ పోస్టులు సాధించి కృషి, పట్టుదల వుంటే దేనినైనా సాధించవచ్చని నిరూపించారు. రమణేపల్లి గ్రామ రైతు బోయ అంజినయ్య, పాలమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. చివరి సంతానం మంజునాథ రిక్రూట్‌మెంట్‌లో సత్తా చాటి ఏపీఎస్‌పీ ఎస్‌ఐగా ఉద్యోగం సాధించారు. ఓవరాల్ ఔట్‌డోర్ టాపర్ గిల్డ్ మెడలిస్ట్‌గా శిక్షణలో రాణించడంతో హోమ్ మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా శనివారం అనంతపురంలోని పరేడ్ గ్రౌండ్‌లో విన్నర్‌గా సిమ్ పిస్తోల్ అందుకున్నారు. సర్పంచ్ రమేష్‌తో పాటు గ్రామస్థులు సంబరాలు చేసి అతడిని అభినందించారు. ఇక బ్రాహ్మణపల్లి తండాకు చెందిన గోపాల్ నాయక్, గీతాబాయి దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్ద కుమారుడు అశోక్‌కుమార్ నాయక్ సివిల్ ఎస్‌ఐగా ఉద్యోగం సంపాదించారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఆయన శనివారం గ్రామానికి రావడంతో గ్రామస్థులు పూలమాలలు వేసి ఊరేగింపు చేశారు. వీరితో పాటు కాలువపల్లికి చెందిన వడ్డే వెంకటేశులు, వడ్డే భాగ్యమ్మల కుమారుడు వడ్డే అశోక్ ఎస్‌ఐగా ఉద్యోగం సాధించారు. ఇక దుద్దేకుంటకు చెందిన దబ్బర అనిల్ కుమార్ పదేళ్లు ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూనే రిక్రూట్‌మెంట్‌లో సివిల్ ఎస్‌ఐగా ఉద్యోగం సాధించారు.

బ్రహ్మసముద్రం: మండలం సూగేపల్లి గ్రామంలో సామాన్య రైతు అయిన కురుబ వన్నూరెడ్డి, భూలక్ష్మి దంపతుల కుమార్తె జ్యోతి 2024 బ్యాచ్‌లో ఎస్‌ఐగా ఉద్యోగం సాధించి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో హోంమంత్రి అనిత సమక్షంలో ఔట్‌పెరేడ్ నిర్వహించారు. జ్యోతి ఎస్‌ఐగా ఉద్యోగం సాధించినందుకు గ్రామస్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.



అశోక్ కుమార్ నాయక్‌కు ఘన స్వాగతం పలుకుతున్న బ్రాహ్మణపల్లితండా వాసులు



హోం మంత్రి చేతుల మీదుగా సిమ్ పిస్తోల్ అందుకుంటున్న రమణేపల్లికి చెందిన మంజునాథ



తల్లిదండ్రులతో సూగేపల్లికి చెందిన జ్యోతి

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



గుంతకల్లులోని నారాయణ కళాశాలలో పరీక్షకేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు ఉదయం 8గంటలకే పరుగులు తీశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఆ కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశారు. పోలీసులు కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఫ్లెక్సీ ఏర్పాటుపై వివాదం



చించివేసిన ఫ్లెక్సీ

యాడికి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శనివారం టీడీపీ శ్రేణులను రెచ్చగొడుతూ వైసీపీ నాయకులు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం వివాదం నెలకొంది. వెంటనే టీడీపీ శ్రేణులు అడ్డుకుని ఆ ఫ్లెక్సీని చించివేశారు. కాగా వివాదానికి కారకులైన వైసీపీ వారిని పోలీసులు వదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పర్యవేక్షణకు తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి యాడికికి వచ్చారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆయన గ్రామపెద్దలతో ఆలయం లోపల సమావేశం నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆలయం బయట ఉన్నారు. కాగా ఆ సమీపంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌పై వైసీపీ నాయకులు టీడీపీ వారిని రెచ్చగొడుతూ ఫ్లెక్సీ ఏర్పాటు చేయబోయారు. దీనిని ఆ పార్టీ శ్రేణులు అడ్డుకుని ఫ్లెక్సీని చించివేశారు. తమను రెచ్చగొడుతూ ఫ్లెక్సీ ఏర్పాటు చేయబోయిన వారిని పట్టుకోవడానికి ప్రయత్నించారు. కాగా పోలీసులు అడ్డుకున్నారు. వివాదానికి కారణమైన వారిని పోలీసులు అదుపులోకి తీసుకోకపోవడంపై టీడీపీ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మాదిగ అమరవీరుల సంస్మరణ సభ

గుత్తి/ గుంతకల్లుటౌన్, మార్చి1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలర్పించిన అమర వీరుల సంస్మరణ సభను పట్టణంలోని అర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద శనివారం ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా నాయకురాలు సునీత మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్రవ్యాప్తంగా పదిమంది ప్రాణాలు అర్పించారన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, నాగరాజు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లు పట్టణంలోని అంబేడ్కర్ గ్రంథాలయం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు మాదిగ అమరులకు నివాళులర్పించారు. సీనియర్ నాయకుడు చెరువు నాగరాజు, మాదిగ దండోర రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాస్, నాయకులు పాల్గొన్నారు. ఇక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కూడా ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నరసింహులు, ఎంఎస్‌ఎఫ్ మండల అధ్యక్షుడు మణిభూషణ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు మాదిగ అమరులకు నివాళులర్పించారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లను పంపిణీ చేస్తున్న స్పెయిన్ దేశస్థులు

బొమ్మనహాళ్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 64 మంది విద్యార్థులకు శనివారం ఉరవకొండ ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో స్పెయిన్ దేశస్థులు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రిష్ణవేణి మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి పాఠశాలలకు నడుచుకుంటూ వెళ్లే విద్యార్థులకు ఈ సైకిళ్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇందులో హరేసముద్రం, ఉంతకల్లు విద్యార్థులు ఉన్నట్లు చెప్పారు. ఎంఈఓ మల్లికార్జున, హెచ్ఎం రాజ్‌కుమార్ ఆర్డీటీ ఏటీఎల్ వెంకటేశులు, ఎస్‌టీఎల్ కిష్టప్ప, సీఓ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెరటికోళ్లు పంపిణీ

రాయదుర్గంరూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గాదేవి మహిళా సమాఖ్య సంఘం ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు శనివారం పెరటి కోళ్ల పంపిణీ చేసినట్లు ఏరియా కో ఆర్డినేటర్ గోవిందప్ప తెలిపారు. వెలుగు కార్యాలయం వద్ద పెరటికోళ్లను టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు పంపిణీ చేశారన్నారు. మల్లాపురం తండా 6, ఆర్‌బీ వంక తండా 8, ఆవులదట్ల 12 మొత్తం 26 యూనిట్ల కోళ్లను పంపిణీ చేసినట్లు చెప్పారు.

యువకుడి అదృశ్యం



కిరణ్ కుమార్

కూడేరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కిరణ్ కుమార్ అనే యువకుడు అదృశ్యమైనట్లు సీఐ రాజు తెలిపారు. నాగేంద్ర కుమారుడు కిరణ్ కుమార్ శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడని, కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ తెలియరాలేదని అన్నారు. ఆ యువకుడు తండ్రి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఎవరికైనా యువకుడి ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బెళుగుప్ప, మార్చి 01 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆవులెన్నలో గల పేకాట కేంద్రంపై శనివారం దాడులు నిర్వహించి ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. వారివద్ద నుంచి రూ. 4330లు నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

బొమ్మనహాళ్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలం దేవగిరి క్రాస్ గ్రామానికి చెందిన వృద్ధుడు చిన్నసుంకన్న ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఆయన ప్రస్తుతం బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వెలుగు సీసీ ఖాజన్న శనివారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ రూ. 4 వేలు అందజేశారు.

డిగ్రీ కళాశాలలో సైన్స్‌డే

రాయదుర్గంరూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని 74 ఉడేగోళం గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. తర్వాత ప్రిన్సిపాల్ రఘురామమూర్తి విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆక్రమణ భూముల పరిశీలన

గుంతకల్లు టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురం గ్రామంలో ఆక్రమణకు గురైన భూములను డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, తహసీల్దార్ రమాదేవి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ భూముల ఆక్రమణపై సువర్ణ అనే మహిళ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారని, ఆ ఫిర్యాదు మేరకు పరిశీలించామని తెలిపారు. ఈ వివరాల నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు.

నిధుల కేటాయింపులో ప్రభుత్వం విఫలం

గుత్తి,మార్చి1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో గుంతకల్లు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలోఈ మేరకు మండిపడ్డారు. మండల కార్యదర్శి రామదాసు, నాయకులు వెంకటరాముడు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల చెంతకు కలెక్టర్

● ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ అందజేత



దివ్యాంగురాలి తల్లిదండ్రులకు పింఛన్ అందజేస్తున్న కలెక్టర్

తాడిపత్రి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను కలెక్టర్ వినోద్‌కుమార్ నేరుగా లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి పంపిణీ చేశారు. మండలంలోని యర్రగుంటపల్లి గ్రామంలో శనివారం తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీతోపాటు వ్యక్తిగత ఇంకుడు గుంతలకు భూమిపూజ నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత పింఛన్‌దారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్‌ను ప్రతినెలా సక్రమంగా అందిస్తున్నారా అని ఆరాతీశారు. తర్వాత పింఛన్‌ను అందజేశారు. అనంతరం ఇంకుడు గుంతల నిర్మాణానికి భూమిపూజచేసి పనులను ప్రారంభించారు. వాటి నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఆ తర్వాత చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి వర్మీకంపోస్ట్ తయారీ గురించి అడిగితెలుసుకున్నారు. ఈ కేంద్రాలు ప్రతి గ్రామంలో పనిచేసేవిధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇక అటవీశాఖ నర్సరీని పరిశీలించి ఇక్కడ ఏయేరకాల విత్తనాలు, ఏరకమైన మొక్కలు అందుబాటులో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఎన్‌హెచ్ 544డీ జాతీయ రహదారికి సంబంధించి భూసేకరణను పరిశీలించి జాయింట్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. జాతీయ రహదారి ఏర్పడడం వల్ల హార్టికల్చర్ ఉత్పత్తులకు అనువుగా ఉంటుందని తెలిపారు. రహదారి పూర్తిచేయడంలో అధికారులకు గ్రామస్థులు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.

సర్వేలు పక్కాప్రణాళికతో చేపట్టాలి

పక్కా ప్రణాళికతో పీ-4 , మిస్సింగ్ సిటిజన్, చైల్డ్ విత్‌అవుట్ ఆధార్ తదితర సర్వేలను చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టణంలోని కృష్ణాపురంలో ఉన్న 2వ సచివాలయాన్ని ఆయన తనిఖీచేసి సర్వేల గురించి అక్కడి సిబ్బందిని ఆరా తీశారు. ఈ సర్వేలను తూతూమంత్రంగా చేయరాదన్నారు. మున్సిపాలిటీలో ఉన్న సచివాలయ ఉద్యోగులు ఒక్కొక్కరు రోజుకు నాలుగు ఇళ్లను సర్వేచేసినా వెయ్యి ఇళ్లు పూర్తవుతాయన్నారు. ఈ దిశగా ప్రణాళికతో పనిచేయాలని చెప్పారు. జేసీప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున, డ్వామాపీడీ సలీంబాషా, హార్టికల్చర్ డీడీ నరసింహారావు, తహసీల్దార్ రజాక్‌వలి, ఎంపీడీఓ ఫజుల్‌బాషా, సర్పంచ్ యుగంధర్, ఈఓఆర్డీ వెంకటేష్, అటవీ అధికారి దీనా, టీడీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

హంసవాహనంపై బుగ్గరామలింగేశ్వరుడు



హంసవాహనంపై కొలువుదీరిన స్వామివారు

తాడిపత్రి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయమే అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి హంసవాహనంపై ఉంచి పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. తర్వాత వసంతోత్సవం జరిపారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయమే అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి పూజ లు చేపట్టారు. అనంతరం నైవేద్యం స మర్పించి మహామంగళహారతి ఇచ్చారు. పెద్దఎత్తున భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని వడ్రవన్నూరు గ్రామ సమీపంలో వెలసి న అపులాపురం ఆంజనేయస్వామి ఆలయం, మల్లాపురం సమీపంలో గల విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి.

కసాపురంలో మన్యుసూక్త హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

గుంతకల్లు టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం అర్చకులు మన్యు సూక్త హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూర్వాబాధ్ర నక్షత్రం సందర్భంగా ఉదయమే స్వామి వారి మూలవిరాట్‌కు బంగారుకవచం ధరింప జేసి పూజలు చేశారు. అనంతరం యాగశాలలో ఉత్సవమూర్తిని కొలువుదీర్చి తిరుమంజన స్నపనం, మన్యుసూక్త హోమం జరిపారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చెత్తతో సంపదతయారీ కేంద్రం పరిశీలన

కణేకల్లు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని డీపీఓ నాగరాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం మూతపడిన ఈ కేంద్రాన్ని పునః ప్రారంభించాలని ఈఓ ప్రసాద్‌ను ఆదేశించారు. అలాగే అక్కడి పలు వార్డులలో తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకుమునుపు జక్కలవడికిలో జరుగుతున్న సర్వే ఆఫ్ విలేజ్ అబాదిని తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 420 గ్రామాలలో ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బీసీ సంక్షేమ హాస్టల్ తనిఖీ

పుట్లూరు, మార్చి1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బీసీ సంక్షేమ హాస్టల్‌ను మండల ప్రత్యేక అధికారి ఆంజనేయులు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్ శివారెడ్డికి సూచించారు. అనంతరం స్టోర్‌రూం, మరుగుదొడ్లను పరిశీలించారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం వెంకటరామిరెడ్డి ఉన్నారు.

పాఠశాల విలీనాన్ని ఒప్పుకోం: ఎస్‌ఎంసీ

కుందుర్పి, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : మాయదార్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని 6, 7, 8 తరగతులను బసాపురం ఉన్నత పాఠశాలలో విలీనం చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని ఆ పాఠశాల కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. పాఠశాలలో శనివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ గతంలో కూడా పాఠశాలలోని 6,7,8 తరగతులను బసాపురం ఉన్నత పాఠశాలలో విలీనం చేసినప్పుడు వ్యతిరేకించి 72 రోజులు పాఠశాలను మూసి వేసి ఆందోళనలు చేశామని, ఆ పోరాటాన్ని గుర్తించి ప్రభుత్వం కూడా పాఠశాల విలీనాన్ని ఆపివేసిందని తెలిపారు. కాగా మళ్లీ పాఠశాల విలీన ప్రక్రియ పునరావృతం కావడం సరైనంది కాదన్నారు. విద్యార్థులు మూడు కిలోమీటర్లు దూరం వున్న బసాపురం ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే చాలా కష్టమన్నారు. పాఠశాల విలీనమైతే విద్యార్థులు చదువులకు దూరమవుతారని, డ్రాప్ ఔట్‌లు పెరగడానికి అవకాశం వుందని అన్నారు. కనుక విలీనం చేయరాదని పేర్కొన్నారు. స్కూల్ కమిటీ చైర్మన్ మర్రిస్వామి, వైస్‌చైర్‌పర్సన్ ఇందిరమ్మ, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు..



మంటలార్పేందుకు ప్రయత్నిస్తున్న అటవీ సిబ్బంది

శెట్టూరు , మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి గొల్లపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో రాచర్ల దిబ్బ ప్రాంతంలో మంటలు చెలరేగి అటవీసంపద దగ్ధమైంది. అటవీ సిబ్బంది మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇప్పటికే గొల్లపల్లి అటవీ ప్రాంతంలో మూడుసార్లు అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుని 20 ఎకరాలు విస్తీర్ణం బూడిదపాలు అయిందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిప్పు పెడుతున్న గుర్తు తెలియని వ్యకులను పోలీసులు, అటవీ అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



కూడేరులో చిత్రపటాలకు పాలభిషేకం

కూడేరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శనివారం నాయీబ్రహ్మణుల సంఘం నియోజక వర్గ కన్వీనర్ కడదరకుంట నాగరాజు సంఘం నాయకులతో కలిసి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో నాయీ బ్రహ్మణులకు ఆదరణ పథకం 450 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. అలాగే సెలూన్ షాపులకు 200 యూనిట్లు కరెంట్ ఉచితమని ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కూటమితోనే నాయీ బ్రహ్మణులను న్యాయం జరుగుతుందని అన్నారు. సంఘం నాయకులు పురుషోత్తం, వెంకటనంద, రామాంజనేయులు, ప్రసాద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పించడంపై పట్టణంలో టీడీపీ జిల్లా పార్లమెంట్ బీసీసెల్ కార్యదర్శి భజంత్రీ కృష్ణ, టీడీపీ నాయీబ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు.